Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.12.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# కేసీఆరే కింగ్

## గుభాళించిన గులాబి

- సైకిల్ తునాతునకల్
- కారు చక్రం క్రింద హస్తం చిత్తు
- ఇది మిత్ర లాభం కాదు... మిత్ర నష్టం
- కేసీఆర్ డబుల్ ధమాకా
- ముందస్తు సెంటిమెంట్ తిరగరాసాడు
- నోటిదూల రేవంత్ కొంప ముంచింది
- టిఆర్ఎస్‌కు కలిసొచ్చిన వైసిపి, జనసేన
- నెత్తిన గుడ్డేసుకున్న కాంగ్రెస్ సీనియర్‌లు



ఒకే ఒక్కడు... అనితర సాధ్యుడు... మాటల మాంత్రికుడు... పనిలో యాంత్రికుడు చేతల్లో కార్యసాధకుడు... అవతల యోధానుయోధులు తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నా తొణక లేదు... బెణక లేదు. ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. ఒంటిచేత్తో చక్రం తిప్పాడు... కొమ్ములు తిరిగిన మొనగాళ్ళను ఇంటికి పంపాడు. తెలంగాణ తెరపై హీరోగా నిలిచాడు.



తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రానే వచ్చాయి. ఫలితాలు చూసాక కళ్ళు బైర్లు కమ్మిన వాళ్ళు కొందరు... స్పృహ కోల్పోయిన వాళ్ళు ఇంకొందరు... ఆసుపత్రులపాలైన వాళ్ళు మరికొందరు. అట్లాంటి ఇట్లాంటి గెలుపా అది... ప్రపంచ దేశాలకే పాఠాలు చెప్పిన రాజకీయ యోధుడి మైండ్ బ్లాకయ్యేలా చేసిన గెలుపది. ఎన్నికల యుద్ధంలో మేము వస్తాదులం అని రొమ్ములు విరుచుకున్న కాంగ్రెస్ పెద్దారెడ్లను ఇంటికి పంపిన విజయమది. కూటమి కట్టి కేసీఆర్‌ను ఓటమి బాట పట్టిస్తాం అంటూ ప్రగల్భాలు పలికిన అవకాశవాద నేతల గూబ గుయ్‌మనిపించిన జైత్రయాత్ర అది. ఈ ఫలితాలు చూసాక కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులు చాలామంది కోమాలోకి వెళ్లిపోయుంటారు. (మిగతా 11వ పేజీలో)




## బ్రాండ్ బాబుకు...

# బ్యాండ్ పడింది



- తెలంగాణలో టిడిపి అడ్రస్ గల్లంతు
- బాబును నమ్మి మునిగిన కాంగ్రెస్

తెలంగాణ ఎన్నికలలో మహాకూటమి గెలిచి వుంటే పరిస్థితి ఎలా వుండేది? సీఎం అభ్యర్థులందరూ అమరావతిలో చంద్రబాబు ఇంటి బయట పడిగాపులు కాస్తుండే వాళ్ళు... చంద్రబాబు లోపల కూర్చుని సీఎంగా ఎవరిని పెట్టాలి, మంత్రివర్గంలోకి ఎవరెవరిని తీసుకోవాలనే దానిపై రాహుల్‌గాంధీతో (మిగతా 11వ పేజీలో)

# టిపిగూడూరులో మోడల్ పోలీస్‌స్టేషన్

## శంకుస్థాపన చేసిన జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి



తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌ను మోడల్ పోలీస్‌స్టేషన్‌గా రూపుదిద్దుతామని, మరో ఆరునెలల్లో ఇక్కడ ఆ మేరకు నిర్మాణ పనులను పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటారని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అన్నారు. ఈనెల 12న ఆయన టిపి గూడూరు పోలీస్‌స్టేషన్ నూతన భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిశ్రమల యాజ మాన్యాల వారు ఇలాంటి సేవాకార్యక్ర మాల్లో పాలుపంచుకోవడం మంచిపరిణా మమంటూ అభినందనలు తెలిపారు. ఇక్కడ గతంలో ఉన్న పోలీస్‌స్టేషన్ శిథిలా వస్థకు చేరుకోవడంతో దాన్ని తొలగిం చారని, అప్పటినుంచి ఇక్కడి పోలీసులు ఎన్నో ఇబ్బందులు పడేవారని అంటూ, పోలీసు అధికారుల కోరిక మేరకు మండ లంలోని అనంతపురంలో ఉన్న సెమ్‌కార్ప్ గాయత్రీ పవర్ కాంప్లెక్స్ యాజమాన్యం వారు నూతన భవన నిర్మాణానికి 75 లక్షల రూపాయల నిధులు కేటాయించా రంటూ వారికి తమ కృతజ్ఞతలు తెలి పారు. వారి సహకారంతో ఇక్కడ కొత్త భవనం రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పరమేశ్వరరెడ్డి, ఎఆర్ అడిషనల్ ఎస్పీ వీరభద్రుడు, క్రైం అడిషనల్ ఎస్పీ ఆంజనేయులు, డిఎస్పీ రాఘవరెడ్డి, ఇన్‌ఛార్జి సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సుబ్బారావుతో పాటు సెమ్‌కార్ప్ గాయత్రి పవర్‌కాంప్లెక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 16న ఆర్యవైశ్య అంతరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్

ఆర్యవైశ్యుల సమస్యలపై గళమెత్తాల్సిన సమయం వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య అధ్యయన కమిటీ కన్వీనర్, నగర డిప్యూటి ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. ఈనెల 13న నెల్లూరు పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో జరిగిన ఆర్యవైశ్యుల అంతరంగ ఆవిష్కరణ సభలో విలేఖర్లతో మాట్లాడుతూ ఆర్య వైశ్యుల స్థితిగతులు, వారి జీవన విధానం ఎలా సాగుతుందో అనే అంశాలపై ఈనెల 16 వతేది ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగే అంతరంగసభకు పార్టీలకు అతీతంగా జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి ఆర్యవైశ్యులందరూ పాల్గొని తమ వాస్తవ స్థితిగతులను తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో కావలి మునిసిపాలిటి ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ, గాదంశెట్టి మోహన్, చీదెళ్ల కిషోర్, తన్నీరు మాల్యాద్రి, నల్లూరు రామకృష్ణ, సత్యం, గాదంశెట్టి మల్లిఖార్జున, పబ్బిశెట్టి శ్రీనివాసులు, శ్రీరాంసురేష్ తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# ఆదాల శంకరరెడ్డి



నిరాడంబర జీవి, మృధుస్వభావి, రైతు బాంధవుడు ఆదాల శంకరరెడ్డి తన 98వ యేట డిసెంబర్ 7వ తేదీ తుదిశ్వాస విడిచారు. అల్లూరు మండలం, నార్తోమోపూరు శంకరరెడ్డి స్వగ్రామం. ఆయనకు భార్య సుశీలమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు ఆదాల రాఘవరెడ్డి గత యేడాది అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మొదటి సంతానం శ్యామలమ్మ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి సతీమణి. రెండవ సంతానం రాఘవరెడ్డి ప్రముఖ కాంట్రా క్టర్‌గా ప్రసిద్ధి చెందగా, మూడవ సంతానం ప్రభాకర్‌రెడ్డి సీనియర్ రాజకీయవేత్తగా, మాజీమంత్రిగా నెల్లూరుజిల్లా రాజకీయాలలో కీలకపాత్ర వహిస్తున్నాడు. నాలుగవ సంతానం జలజ నెల్లూరుజిల్లా కనుపర్తిపాడుకు చెందిన డాక్టర్ బిరుదవోలు దయాకర్‌రెడ్డి సతీమణి. 5వ సంతానం ఆదాల మురళీ కృష్ణారెడ్డి కాంట్రాక్టర్‌గా, బిల్డర్‌గా ప్రసిద్ధి చెంది 'మాక్' ప్రాజెక్ట్స్, హోటల్స్ సారధిగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

శంకరరెడ్డికి తొలినుండి వ్యవసాయమంటే మక్కువ ఎక్కువ. తాను రైతుగా జీవనం సాగిస్తూ తన బిడ్డలందరిని ఉన్నత చదువులు చదివించాడు. ఆయన అభిలాషకు తగ్గట్లుగా ఆయన కుమారులు, అల్లుళ్ళు అత్యున్నత స్థాయిలో స్థిరపడ్డారు. మనుమలు, మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళతో సంతృప్తికరమైన సంపూర్ణ జీవనం సాగించి కన్నుమూశారు.

జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా కూడా ఆయన కొంతకాలం పనిచేశారు. స్వర్గీయ జక్కా రంగారెడ్డికి శంకరరెడ్డి తోడల్లుడు. జిల్లాలో అటు వ్యాపార రంగంలోనూ, ఇటు రాజకీయరంగంలోనూ జక్కా, ఆదాల కుటుంబాలు ప్రసిద్ధి చెందాయి. శంకరరెడ్డి మృతితో దుఃఖసాగరంలో వున్న ఆదాల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా రామ్‌కుమార్

జిల్లా స్పెషల్‌బ్రాంచ్ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కోటారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు ఎస్‌బి డిఎస్పీగా పనిచేస్తున్న రామ్‌కుమార్ నియమితులయ్యారు. ఈనెల 12న ఈ బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. కోటారెడ్డి జిల్లాలోని పోలీసు విభాగాల్లో పలు స్టేషన్లలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి అందరి ప్రశంసలు అందు కున్నారు. కొత్త డిఎస్పీ రామ్‌కుమార్ క్రీడారంగంలో బాగా రాణిస్తున్నారు. టెన్నిస్‌లో అంతర్జాతీయస్థాయి పోటీల్లో సైతం తన ప్రతిభను కనపరిచినట్లు సమాచారం. పాత డిఎస్పీ కోటారెడ్డిని అభినందిస్తూ.. కొత్త డిఎస్పీ రామ్ కుమార్‌కు 'లాయర్' శుభాకాంక్షలు.

## డిఆర్‌డిఎ పి.డిగా మురళి

నెల్లూరుజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎస్‌ఎం మురళిని నియమించారు. కడప ఆర్డీఓగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. డిఆర్‌డిఏ పి.డిగా వున్న కె.ఎం.రోజ్ మాండ్‌ను ప్రభుత్వానికి రిపోర్ట్ చేసు కోవాలని ఆదేశించారు.

## డిసిసి ప్రధాన కార్యదర్శిగా శీలం తిరుపయ్య

జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా శీలం తిరుపయ్యను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు డా.ఎన్.రఘువీరారెడ్డి సూచన మేరకు ఏపిసిసి ప్రధాన కార్యదర్శి సూరి బాబు తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా జిల్లా ఎస్‌సి విభాగం అధ్యక్షు లుగా, రాష్ట్ర ఎస్సీ విభాగం కన్వీనర్‌గా కూడా ఆయన కొనసాగుతారని పేర్కొ న్నారు. తనకు ఆ పదవి వచ్చేందుకు సహకరించిన వారందరికీ తన కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లాలో కాంగ్రెస్‌ను మరింతగా పటిష్టవంతం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా శీలం తిరుపయ్య తెలియజేశారు.

● వైసిపిలోకి వరసపెడుతున్న వలసలు

# జనం చూపు వైకాపా వైపు



## వైసిపిలోకి పిండి... స్వాగతించిన నేతలు

ఒకప్పుడు స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి మెయిన్ టీమ్‌లో మెంబర్, కౌన్సిలర్‌గా అనుభవం వున్న లీడర్, ఫత్తేఖాన్‌పేట ప్రాంతంలో పట్టున్న స్థానికుడు పిండి సురేష్ తెలుగుదేశం పార్టీని వీడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పార్టీ పరి శీలకులు సజ్జల రామకృష్ణారెడ్డి, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయ కుమార్‌రెడ్డి, డిప్యూటి మేయర్ ఎం.ద్వారకానాథ్‌ల సమక్షంలో ఆయన వైసిపిలో చేరాడు. ఈ సందర్భంగా పిండి సురేష్‌ను పార్టీలోకి స్వాగతించిన నాయకులు పార్టీకి ఆయన సేవలు వాడుకుంటామని చెప్పారు. అందరం కష్టపడి వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు.

## జగన్‌తో నడుద్దాం.. కష్టాలు తొలగిద్దాం...



నెల్లూరు నగరం 41వ డివిజన్ పరిధిలోని చేపల మార్కెట్, తిరిసిపేట, కొండదిబ్బ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, కార్మికులు, మహిళలు పెద్దఎత్తున 10వ తేదీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి పార్టీలో చేరిన అందరికీ కండువాలు కప్పి ఆహ్వానించి, వారికి అభినందనలు తెలిపారు. జగన్ ప్రకటించిన నవరత్నాల పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు వరమన్నారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తన ప్రజల ఆరోగ్యం బాగుండాలని చెప్పి తనకు చేతనైనంతలో రాజన్న కంటివెలుగు, రాజన్న గుండె భరోసా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పాడు. వైసిపి కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్‌అహ్మద్, నాయకులు వడ్లమూడి చంద్ర, మూళెం సుధీర్‌కుమార్ రెడ్డి, సీవి రాఘవరావు, ఇంతియాజ్, అల్లంపాటి జనార్ధన్‌రెడ్డి, మున్వర్ పాల్గొన్నారు.

## ఫ్యాన్ కిందకు మనుబోలు నాయకులు




నెల్లూరులోని వైయస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో ఈనెల 9న మనుబోలు మండలానికి చెందిన టీడీపీ నాయకులు వైయస్సార్ సీపీలో చేరారు. మండల ప్రధాన కార్యదర్శి, మండల హాస్పిటల్స్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సూరపనేని కిశోర్ నాయుడు, టీడీపీ మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు గిద్దంటి రమణయ్య, పింగాణి రంగారెడ్డి, పోలంరెడ్డి సుధాకర్‌రెడ్డి, దండు సుబ్బారెడ్డి, దాసరి విజయ్‌కుమార్, అల్లాడి మురళితో పాటు దాదాపు 100 కుటుంబాల వారు వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారంతా తెలుగుదేశం పార్టీలో ఇమడలేక పార్టీ మారా రన్నారు. పార్టీలో పెరుగుతున్న వలసలను గమనిస్తే సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా గల్లంతయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వైయస్సార్ సీపీ అధికారంలోకి వస్తే పదేళ్ళ అభివృద్ధిని ఐదేళ్ళలో చేసి చూపిస్తానన్నారు.

# చంద్రబాబు చక్రం విరిగింది

**- ఆనం రామనారాయణరెడ్డి**



జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పుతానంటున్న చంద్రబాబుకు తెలంగాణ ఎన్నికల ఫలితాలతోనే దిమ్మ తిరిగిందని మాజీమంత్రి, వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జ్ ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నాడు. 12వ తేదీ వెంకటగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలను శాసిస్తానంటూ ఏపి ప్రజలను గాలికొదిలేసిన చంద్రబాబు తెలంగాణ ఎన్నికల్లో తొలి ప్రయత్నంలోనే బోల్తా పడ్డారని విమర్శించాడు. తెలంగాణలో రెండు సీట్లకే పరిమితమైన చంద్రబాబు ప్రధాని మోడీతో యుద్ధం చేస్తానని ప్రకటించడం కామెడీగా వుంది. ఆంధ్రాలో దోచుకున్న డబ్బంతా ఆయన తెలంగాణలో ఖర్చు పెట్టారు. రాజకీయ ఉనికి కోసం తప్పుడు విధానాలకు పాల్పడుతున్న చంద్రబాబుకు రేపు ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా తెలంగాణకు మించే రీతిలో గుణపాఠం చెప్పనున్నారు. ఏపిలో రామరాజ్యం, రాజన్న రాజ్యం మరపించేలా జగన్ రాజ్యం రాబోతుందని ఆయన పేర్కొన్నాడు. నందమూరి కుటుంబాన్ని చంద్రబాబు ముప్పైఏళ్ళుగా మోసం చేస్తూనే వున్నాడని నందమూరి హరికృష్ణ కుటుంబాన్ని అవమాన పరచాలనే ఉద్దేశ్యంతోనే చంద్రబాబు హరికృష్ణ కూతురు సుహాసినిని ఓడిపోతుందని తెలిసే కూకట్‌పల్లిలో పోటీకి పెట్టారని ఆనం ఆరోపించాడు.



## మరో సక్సెస్ కోసం
# షార్ సిద్ధం

నవంబర్ 14వ తేదీన జిఎస్ఎల్వి మార్క్3-డి2ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో, ఆ తర్వాత 15రోజులకే 29వ తేదీన పిఎస్ఎల్వి-సి43ని నింగిలోకి పంపి విజయం సాధించింది. ఈ ప్రయోగం జరిగిన 20రోజులకే మరో ప్రయోగానికి శ్రీహరికోటలోని షార్ సెంటర్ ముస్తాబైంది. ఈ నెల 19వ తేదీ సాయంత్రం జిఎస్ఎల్వి-ఎఫ్11ను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు గల కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్ -7ఏను కక్ష్యలో ప్రవేశపెట్టబోతున్నారు. ఈ మేరకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒకప్పుడు నెలల గ్యాప్‌లో రాకెట్ ప్రయోగాలు జరిగేవి. ఇప్పుడు వారాలలోకి వచ్చాయి. త్వరలో రోజుల తేడాలోకి ప్రయోగాలు రావచ్చు.

# అందరికీ వైద్యం... నా ధ్యేయం!

**ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరురూరల్ నియోజకవర్గంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మొత్తం 50 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 11వతేదీన నెల్లూరురూరల్ పరిధిలోని ఆకుతోట హరిజనవాడలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ దీంతో 17వైద్యశిబిరాలు పూర్తి చేశామని, మిగతా ప్రాంతాలలో కూడా నిర్వహిస్తామన్నారు. కొందరు సాధారణ పరీక్షలు కూడా చేయించుకోక, అనుకోకుండా అనారోగ్య పరిస్థితులకు గురవుతున్నారని, కొందరు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, నా నియోజకవర్గ ప్రజలకు అలాంటి పరిస్థితులు రాకూడదనే వారి చెంతనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాలలో ప్రతిఒక్కరికీ వైద్యపరీక్షలు నిర్వహించడమే కాకుండా వైద్యుల సూచన మేరకు అవసరమైన వారికి కంటి అద్దాలను ఇవ్వడం, ఆపరేషన్‌లు చేయించడం జరుగుతుందన్నారు. ఈ వైద్యశిబిరాల నిర్వహణకు సహకరిస్తున్న వైద్యులకు, ఆసుపత్రుల యాజమాన్యాలకు, ఆపరేషన్‌లకు సహకరిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సేవలకు అవార్డుల సత్కారం

**బెస్ట్ క్లబ్ మెంబర్, గోల్డ్ డోనర్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి**




ఈ నెల 9వ తేదీన రాజమండ్రిలోని ఆనం కళాకేంద్రంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ 27వ వార్షిక సదస్సులో వాకర్స్ డిప్యూటి గవర్నర్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డిని బెస్ట్ క్లబ్ మెంబర్, గోల్డ్ డోనర్ అవార్డులతో సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు కొండూరి రంగారావు, హాకీ రామకృష్ణ, చెలికాని సీతారామయ్య, చంద్రమౌళి, ఎం.వి.సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, శ్యామలా శ్రీనివాసులురెడ్డి, ఎం.రామకృష్ణారెడ్డి, నజీర్ సుల్తాన్‌ల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డులను స్వీకరించారు.

# నగర అందాలకు మణిహారంగా 'నెక్లెస్'

**- నుడా శీనయ్య**



నెల్లూరు నగర అందాలను నెక్లెస్‌రోడ్డు మరింత ద్విగుణీకృతం చేయబోతుందని చెబుతున్నాడు నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. 12వ తేదీ నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద 30కోట్లతో చేపట్టిన నెక్లెస్‌రోడ్డు పనులను ఆయన పరిశీలించాడు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లా ప్రజలే కాదు, బయట జిల్లాల నుండి పర్యాటకులు వచ్చి చూసేవిధంగా ఈ రోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి రాకముందు నగరంలో పార్కులను పట్టించుకున్న నాథుడే లేడు. మంత్రి నారాయణ చల్లని చూపుతో నగరంలో ఎనో పార్కులు అభివృద్ధి చెందాయి. పచ్చని చెట్లతో కనువిందు చేస్తున్నాయి. కావలి నుండి తడ వరకు అన్ని పట్టణాలు, అన్ని మండల కేంద్రాలలో పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. మేం ఇంతగా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు కడుపు మంటతో రగిలిపోతున్నాయి. నెక్లెస్‌రోడ్డు పనులపై కూడా లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగానే నెక్లెస్‌రోడ్డు పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి పనులను రాజకీయం చేయొద్దని ఆయన హితవు పలికాడు.

# అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో మెరిసిన 'రత్నం' విద్యార్థులు

అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షల్లో నెల్లూరు సరస్వతీనగర్‌లో వున్న రత్నం రేస్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారని పాఠశాల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు తెలిపారు. ఈనెల 12న పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో వారు మాట్లాడుతూ 3వ తరగతి విద్యార్థి పి.తరుణ్ పాండి, 4వ తరగతి విద్యార్థి యల్.సాయిరాం మనీష్, 5వ తరగతి విద్యార్థి యస్.హాసింతరావు మొదటి స్థాయి పరీక్షల్లో ప్రథమ ర్యాంకులు సాధించారన్నారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

## కరాటేలోను ప్రతిభ..

లార్జెస్ట్ కరాటే కటా అనే విభాగంలో నెల్లూరు ఏసీ నగర్ రత్నం పాఠశాల విద్యార్థులు యూనివర్సల్ ప్రపంచ రికార్డును సాధించారని పాఠశాల డైరెక్టర్ కె. రమా వేణుగోపాల్ తెలిపారు.



ఈనెల 12న పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ అల్ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు కోసం కావలిలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ యు.శ్రీనివాసులు, కరాటే మాస్టర్ ఇబ్రహీం పాల్గొన్నారు



## 'ప్రభా'తం

# ప్రమాద ఘంటికలు

2019 పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల సంగ్రామం అనే ఫైనల్ మ్యాచ్‌కు ముందుగా ఐదు రాష్ట్రాలలో సెమీఫైనల్స్‌గా భావించిన అసెంబ్లీ ఎన్నికలు జరగనూ జరిగాయి, ఫలితాలు రానూ వచ్చాయి. బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలతో పాటూ టిఆర్ఎస్, మిజో నేషనల్ ఫ్రంట్ వంటి ప్రాంతీయ పార్టీలు కూడా ఈ ఎన్నికలలో ప్రధానంగా తమ భవిష్యత్‌ను నిర్ణయించుకున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలలో మిగతా పార్టీలన్నింటిదీ నామమాత్రపు పాత్రే!

డిసెంబర్ 11వ తేదీన ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాలలో తీవ్రంగా నష్టపోయింది కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీనే! అధికారంలో వున్న మూడు రాష్ట్రాలను ఆ పార్టీ కాంగ్రెస్‌కు అప్పగించింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లలో కాంగ్రెస్ పాగా వేసింది. 2014 ఎన్నికల తర్వాత దేశంలో కాంగ్రెస్‌పార్టీ సాధించిన అతిపెద్ద విజయం ఇదే! పంజాబ్ ఎలక్షన్ తర్వాత వారి తలుపు తట్టిన గెలుపు ఇదే! గత నాలుగున్నరేళ్ళుగా ఒక్కో రాష్ట్రంలో అధికారం కోల్పోతూ వస్తున్న కాంగ్రెస్‌కు ఈ మూడు రాష్ట్రాల గెలుపు పెద్ద ఊరటనే చెప్పాలి. అంతేకాదు, 2019లో ఢిల్లీ అధికారాన్ని కైవసం చేసుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులకు ఈ ఫలితాలు ఉత్తేజాన్ని నింపేవి కూడా! ఈ మూడు రాష్ట్రాలలో బీజేపీ పరాజయాలపై ఆ పార్టీ నాయకత్వం పోస్ట్‌మార్టమ్ చేసుకోక తప్పదు. రాజస్థాన్‌లో ఓటమి అన్నది సాధారణ విషయం. అక్కడ ఐదేళ్ళ కోసారి బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య అధికార మార్పిడి జరుగుతుంటోంది. అంతేకాదు, ముఖ్యమంత్రి వసుంధర రాజె ప్రజల ఆదరణ పొందే విధంగా పని చేయలేదు. ప్రజల్లో కలవలేని మనిషి. ఆమె పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వుంది. అక్కడ ఓటమి ముందుగా ఊహించినదే! అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ గట్టిగానే పోరాడిందనుకోవచ్చు. మరీ అంతగా గల్లంతు కాలేదు. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లలో ఆ పార్టీ గెలిచుంటే వరుసగా ఇది నాలుగో గెలుపయ్యుండేది. ఆ అవకాశం మిస్సయ్యింది. చత్తీస్‌ఘడ్ సీఎం రమణసింగ్ సమర్ధవంతమైన నాయకత్వం అందించినప్పటికి, ఈ ఎన్నికల్లో పార్టీని పరాజయం బాట నుండి తప్పించలేకపోయాడాయన! చత్తీస్‌ఘడ్‌లో బీజేపీకి దారుణ పరాభవం మిగిలింది. ఇక మధ్యప్రదేశ్‌లో అయితే బీజేపీ - కాంగ్రెస్‌ల మధ్య చివరి వరకు నువ్వా-నేనా అన్నట్లుగానే సమరం నడిచింది. కేవలం 5 సీట్లు వెనుకబడి బీజేపీ అధికారం కోల్పోగా, ముక్కి మూలిగి 20ఏళ్ల తర్వాత కాంగ్రెస్ మధ్యప్రదేశ్‌లో పెద్దపార్టీగా నిలిచింది. అయితే అక్కడకూడా ఇతరుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి.

పై మూడు రాష్ట్రాల ఫలితాలు కాంగ్రెస్‌లో ఉత్సాహం నింపేవే! అయితే అదే సమయంలో అధికారంలో వున్న మిజోరంను ఆ పార్టీ కోల్పోయింది. మిజోనేషనల్ ఫ్రంట్ ఆ రాష్ట్ర అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. అన్నింటికి మించి ఆ పార్టీకి మింగుడుపడని ఫలితం తెలంగాణ. ఈ రాష్ట్రంలో అయితే అధికారంలోకి వచ్చేసినట్లే భావించారు. అధికారంలోకి రావాలన్న యావతో విలువలను వదిలేసారు. తెలుగుదేశంతో పొత్తు పెట్టుకున్నారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లో ప్రచారానికి వెళ్లారు. చంద్రబాబును నిండా నమ్మారు, నిలువునా మునిగిపోయారు. 2014లో ఆంధ్రప్రదేశ్‌ను విభజించి తెలంగాణను ఏర్పాటు చేసిందే ఆ రాష్ట్రంలో పాగా వెయ్యడం కోసం. 2014లో ఆ ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు రెండోసారి కూడా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నిరాకరించారు. దీంతో ఇక్కడ కాంగ్రెస్ కేడర్ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. తెలంగాణలో టిఆర్ఎస్ వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం ద్వారా దేశ రాజకీయాలలో మరో బలమైన ప్రాంతీయ పార్టీ ఆవిర్భవించినట్లయ్యింది.

మొత్తంగా ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చూస్తే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఇది ఒక హెచ్చరికగానే భావించాలి. వాళ్ళు అధికారం కోల్పోయిన మూడు రాష్ట్రాలలో చూస్తే... రాజస్థాన్‌ను పక్కన పెడితే మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లలో ఓటమిపై లోతైన అధ్యయనం జరగాలి. అక్కడి స్థానిక ప్రభుత్వాలపై ప్రజల్లో వ్యతిరేకత లేదు. ఇద్దరు సీఎంలపై అవినీతి ఆరోపణలు లేవు. సమర్ధవంతమైన పరిపాలనను అందించిన నాయకులు. మరి లోపం ఎక్కడ జరిగింది. ప్రధానంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై ఈ రూపంలో ప్రజావ్యతిరేకత వ్యక్తమైందని అనుకోవాలి. ముఖ్యంగా రైతాంగ సమస్యల పట్ల కేంద్రం సరిగా స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల ఉద్యమాలను సైతం కేంద్రం చిన్నచూపు చూస్తుందనే ఆరోపణలున్నాయి. ఇదే కాదు నోట్ల రద్దు కష్టాలు, జిఎస్టీ వంటి అంశాలు సామాన్య ప్రజలకు బీజేపీని దూరం చేశాయి. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం దేశాభివృద్ధికి ఏమేం చేస్తుందో కూడా చెప్పుకోలేకపోతుంది. పార్టీలో నరేంద్ర మోడీ, అమిత్‌షాలు తప్పితే ఇంకెవరూ కనిపించడం లేదు. కాబట్టి 2019 ఎన్నికలకు కూడా దేశంలో ఇదే వాతావరణముంటే బీజేపీకి గడ్డు కాలమే! అదే సమయంలో మూడురాష్ట్రాల్లో అధికారం వచ్చిందని కాంగ్రెస్ చంకలు గుద్దుకోబల్లేదు. బీజేపీపై వ్యతిరేకత వల్లే ఆ మూడు రాష్ట్రాలలో మరో ప్రత్యామ్నాయం లేక ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేసారు. కాని ప్రత్యామ్నాయం వున్న తెలంగాణ, మిజోరాంలలో ప్రజలు ప్రాంతీయ పార్టీలకు పట్టం కట్టారు! కాంగ్రెస్ వాళ్ళు ఇది గమనించాలి.

ఈ ఫలితాలు మోడీకి ముందస్తు హెచ్చరిక లాంటివి. ఈ ఫలితాలపై సరిగ్గా విశ్లేషణ చేసి లోపాలను సరిదిద్దుకోగలిగితే, ఈ ఫలితాలే ఆ పార్టీ నాయకత్వానికి గుణపాఠాలై, భవిష్యత్ విజయానికి బాటలు వేస్తాయి.



రైతుల ఉద్యమాలను సైతం కేంద్రం చిన్నచూపు చూస్తుందనే ఆరోపణలున్నాయి. ఇదే కాదు నోట్ల రద్దు కష్టాలు, జిఎస్టీ వంటి అంశాలు సామాన్య ప్రజలకు బీజేపీని దూరం చేశాయి. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం దేశాభివృద్ధికి ఏమేం చేస్తుందో కూడా చెప్పకో లేకపోతుంది. పార్టీలో నరేంద్ర మోడీ, అమిత్‌షాలు తప్పితే ఇంకెవరూ కనిపించడం లేదు. కాబట్టి 2019 ఎన్నికలకు కూడా దేశంలో ఇదే వాతావరణముంటే బీజేపీకి గడ్డు కాలమే!

---

### హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌వారు..
## రక్తదానం చేశారు

నెల్లూరులోని రామలింగాపురంలో ఉన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిబ్బంది ఈనెల 7వ తేదిన రక్తదానం చేసి 125 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ క్లస్టర్ హెడ్ లంకా మణికంఠ మాట్లాడుతూ తమ బ్యాంక్ ఆధ్వర్యంలో గత పదకొండేళ్ళుగా ఏటా డిసెంబర్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి రక్తదానం చేస్తున్నామని అంటూ తమ సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## వేణుగోపాలునికి అధ్యయనోత్సవాలు

నెల్లూరు మూలాపేటలో కొలువై ఉన్న రుక్మిణీ-సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో ఈనెల 7 నుంచి 27వ తేది వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 7న ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి-అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుంటున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

### మూలస్థానేశ్వరునికి
## 6.91లక్షల హుండీ ఆదాయం

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 7న హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.6.91లక్షలకుపైగానే ఆదాయం వచ్చింది. సెప్టెంబర్ 29 తేది నుంచి డిసెంబర్ 6వ తేది వరకు భక్తులు స్వామివారికి ఈ హుండీల ద్వారా 6,91, 417 రూపాయలను కానుకగా సమర్పించారని ఆలయ ఇఓ ఆరంబాకం వేణుగోపాల్ తెలియజేవారు.

---

## గెలుపు కోసం పని చేయాలి

ఈ ఎన్నికల ఫలితాలు చూసైనా నరేంద్ర మోడీ తన విధానాలు కొన్ని మార్చుకోవాలి. 70ఏళ్ళ కాంగ్రెస్ దాష్టీకానికి అలవాటు పడ్డ ప్రజల్లో ఒక్కసారిగా మార్పు రమ్మంటే రాదు. నిదానంగా మార్పు తీసుకురావాలి. ఆర్ధిక నియంత్రణను ప్రజలు ఒక్కసారిగా తట్టుకోలేరు. మెల్లమెల్లగా అలవాటు చేయాలి. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని అధికారంలోకి తిరిగి తీసుకురావాలంటే మోడీ కొన్ని విధానాలని మార్చుకోక తప్పదు.

**- కొమ్మిరెడ్డి సుజాత, నెల్లూరు.**

## క్షమాపణ చెప్పి ఏం లాభం

తెలంగాణలో పలుచోట్ల ఓట్ల గల్లంతుపై ఎన్నికల అధికారి రజత్‌కుమార్ క్షమాపణ చెప్పాడు. ఓట్ల గల్లంతు అన్నది ఆషామాషీ విషయం కాదు. ప్రభుత్వాల తలరాతలనే మార్చే నిర్ణయం. ఒక్క సీటు తేడాతో ప్రభుత్వాలు అటు ఇటు కావచ్చు. ఒక్క ఓటు తేడాతో కూడా అభ్యర్థులు అప్పుడప్పుడూ గెలుస్తుండొచ్చు. అలాంటి సందర్భాలలో ఇలాంటి ఓట్లు గల్లంతు తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎన్నికలకు 3నెలల ముందే స్పష్టమైన ఓటర్ల జాబితాలు విడుదల చేయాలి. **- సంగిటి కిషోర్‌కుమార్, నెల్లూరు.**

## బాగా బుద్ధి చెప్పారు

నక్కజిత్తుల చంద్రబాబుకు తెలంగాణ ప్రజలు బాగా బుద్ధి చెప్పారు. కాంగ్రెస్, తెలుగుదేశంల అపవిత్ర కలయికను తిరస్కరించారు. చంద్రబాబుతో కలిసే తెలంగాణలో కాంగ్రెస్ చతికిలబడిపోయింది. ఒంటరిగా పోటీ చేసున్నా ప్రజలలో వారిపట్ల సానుభూతి ఉండేదేమో! **- తేకుల రవికృష్ణ, హైదరాబాద్.**

## కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదర్శం

ప్రజలతో కరచాలనం చేసి చేతి రుమాలుతో తుడుచుకునే నాయకులు వున్న నేటి సమాజంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం నడుములోతు మురికి నీటిలో దుర్గంధ భరితమైన వాతావరణాన్ని లెక్క చేయక మురికి నీటిలో దిగి ప్రజల కోసం అధికారులను దిగివచ్చేటట్లు చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శం. గత నాలుగున్నర సంవత్సరాలుగా నియోజకవర్గ పరిధిలోని ప్రతి గడపను ఎక్కి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి ప్రజానేతగా శ్రీధర్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి కనీసం అభ్యర్థి కూడా దొరకకపోవడం కోటంరెడ్డి పని తీరుకు నిదర్శనం. ఆయనను ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని మిగిలిన 9 నియోజకవర్గాల శాసనసభ్యులు ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరుతున్నాము.

**ఎస్.బాబు, కావలి.**




## 'కస్తూరిదేవి కథలు' బాగున్నాయి

ప్రతి వారం 'లాయర్' వారపత్రికలో వస్తున్న 'ఇదీ కస్తూరిదేవి కథ' చరిత్ర ఎంతో బాగుంది. కస్తూరిదేవి విద్యాలయం మీద వస్తున్న సమీక్షలు, వార్తాకథనాలు అన్నీ ఎంతో ఆసక్తికరంగా వున్నాయి. మాకు తెలియని ఎన్నో విషయాలు తెలియజేస్తున్నారు. ఎంతో పరిశోధనాత్మకంగా, పరిశీలనాత్మకంగా వున్న ఆ కథనాలు, మీ వ్యాఖ్యలు కస్తూరి దేవి విద్యాలయానికి సంబంధించిన వాస్తవచరిత్రకు దర్పణంగా నిలుస్తున్నాయి. ఇంత వివరంగా వార్తాకథనాలను అందిస్తున్న మీకు మా ధన్యవాదాలు. **- దశయ్య, మోపూరు.**

## దొంగలంతా ఒక చోటుకి

ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా దేశంలోని దొంగలంతా ఒకటవుతున్నారు. ఢిల్లీలో 14పార్టీల వాళ్ళు మీటింగ్ పెట్టారు. వీళ్ళ లక్ష్యం మోడీని ఓడించడం. ఈ 14మందిలో ఒక్కడుకూడా శుద్ధమైనోడు లేడు. ఆరోపణలు లేనోడు లేడు. అందరూ అవినీతి పరులే! కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును దోచుకున్నోళ్ళే! మోడీని వేలెత్తి చూపడానికి వీళ్ళ వద్ద ఏ ఆధారాలు లేవు. కేవలం నోట్ల రద్దు, జిఎస్టీ వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే అంశాలతో మాత్రం ఏకమవుతున్నారు. **పి.దయాసాగర్, పోరుమామిళ్ళ.**

## రామనారాయణ రాక...

# వీళ్ళకు కలిసొచ్చేనా?







మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశం నుండి వైసిపిలో చేరుతున్న సమయంలో జిల్లా వైసిపి నాయకులు పెద్దగా వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. మేకపాటి కుటుంబసభ్యులు ముగ్గురు మాత్రమే ఆయనను పార్టీలోకి తీసుకోవడాన్ని వ్యతిరేకించారు. అసలు ఆనంను పార్టీలోకి తీసుకోవాలన్న ఆలోచనకు బీజం వేసిందే మేకపాటి గౌతంరెడ్డి. తర్వాత తన సీటు ఎక్కడ పోతుందోనని అడ్డుపుల్ల వేసింది కూడా ఆయనే! ఇక మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అయితే తన సీటుకు ఎక్కడ తన వాళ్ళు ఎసరు పెడతారోనని బహిరంగంగానే ఆనంపై విరుచుకుపడ్డాడు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి అయితే ఆనంను తీసుకోవడాన్ని వద్దనలేదుగాని తమ సీట్లకు అడ్డురాకుండా వుండాలనుకున్నాడు. వారి కోరిక ప్రకారమే పార్టీలో చేరాక ఆనంను వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా పంపడం జరిగింది.

వాస్తవంగా ఆనంను వీళ్ళు పెద్దగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్‌లో వున్నప్పుడు కూడా వీళ్ళ మధ్య సఖ్యత కొనసాగింది. ఆనంతో ఎవరికన్నా బలంగా విభేదాలున్నాయంటే... అది సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకే! కాంగ్రెస్‌లో వున్నప్పుడే ఆనంతో వీళ్ళ ముగ్గురికీ విభేదాలుండేవి. వై.యస్. మరణానంతరం జగన్ వైసిపిని స్థాపించడం, అందులో ఈ ముగ్గురు నాయకులు చేరడం జరిగింది. కాని, అంతవరకు ఈ జిల్లాలో వై.యస్. అనుచరులుగా బలమైన ముద్ర వేయించుకున్న ఆనం సోదరులు మాత్రం కాంగ్రెస్‌లోనే వుండిపోయారు. అంతేకాదు, వై.యస్. కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ సమయంలో ఆనం సోదరులకు కౌంటర్ అటాక్ ఇచ్చింది శ్రీధర్‌రెడ్డి, అనిల్, కాకాణిలే! అంత బలమైన యుద్ధం సాగింది వారి మధ్య!

వైసిపిలోకి ఆనం రామనారాయణరెడ్డి వస్తానంటే, ముందు అభ్యంతరం పెట్టాల్సింది ఈ ముగ్గురే! వాళ్ళు అలా చేయలేదు. పార్టీలోకి స్వాగతించారు. అంతేకాదు, ఆయనతో కలిసిపోయారు. కలిసి తిరుగుతున్నారు. ఆనం రామనారాయణరెడ్డి చేరిక వల్ల అంతో ఇంతో పార్టీకి ఉపయోగం ఉండొచ్చు. ఇక నియోజకవర్గాల పరంగా చూస్తే సర్వేపల్లిలో కాకాణికి ఆయన చేరిక బాగా ఉపకరిస్తోంది. పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాలలో ఆనం అనుచరవర్గం బాగానే వుంది. వీళ్ళంతా కూడా ఈసారి వైసిపికి బలంగా పనిచేసే అవకాశాలున్నాయి. నెల్లూరు నగరం, రూరల్‌లో కూడా ఆనం అనుచర వర్గం వైసిపి అభ్యర్థులకు సహకరించవచ్చు. ఆత్మకూరులోనూ పార్టీకి ఆనం వర్గం కలిసొస్తుంది. ఇదంతా కూడా వెన్నుపోటు రాజకీయాలకు తావు లేకుండా పార్టీని గెలిపించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనం పనిచేస్తేనే ఆయన చేరికవల్ల పార్టీకి ప్రయోజనం వుంటుంది.


## మస్తానయ్య పార్లమెంటుకు వెళతాడా?



తెలుగుదేశం నుండి నెల్లూరు పార్లమెంటుకు వినిపిస్తున్న మొదటి పేరు ఆదాల ప్రభాకర్‌రెడ్డి. ఒకవేళ ఆయన నేను పోటీ చేయనంటేనో, లేదా ఒక పార్లమెంటు సీటును బీసీలకు ఇవ్వాలని ఇస్తేనో వెంటనే వినిపిస్తున్న పేరు బీద మస్తాన్‌రావు. 2012 ఉపఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నుండి పోటీ చేసాడు. దారుణ పరాజయం చవిచూడాల్సి వచ్చింది. అయితే ఆరోజున్న పరిస్థితులు వేరు, ఇప్పుడంత దారుణం లేదనుకోండి.

కాని పార్లమెంటుకు పోటీ చేయాల్సివస్తే బిఎంఆర్ చేస్తాడా? కావలిని వదులుకుంటాడా? ఇంతవరకు గెలిచినా ఓడినా ఆయనకంటూ కావలి అసెంబ్లీ నియోజకవర్గం అన్నది ఒకటుంది. గెలిచినా ఓడినా అసెంబ్లీ స్థానంలో వున్న ఆ ఫీలింగ్ పార్లమెంటులో రాదు. అదీగాక పార్లమెంటు స్థానం అన్నది పర్మినెంట్ కాదు. ఒకసారి ఓడిపోయామంటే ఆ తర్వాత దఫా మనకే ఇస్తారనే గ్యారంటీ లేదు. 2004లో బిఎంఆర్ అల్లూరు నుండి ఓడిపోయాడు. 2009లో అల్లూరు కలిసిన కావలి నుండి పోటీచేసి గెలిచాడు. 2014లో కావలి నుండి ఓడిపోయాడు. అప్పటి నుండి కూడా ఆయన నియోజక వర్గాన్ని వదల్లేదు. కావలి నియోజకవర్గంలో ఈరోజుకు కూడా బీద మస్తాన్‌రావే బలమైన అభ్యర్థి. ఇక్కడున్న స్థానిక బలం పార్లమెంటులో రాదు. ఈ నేపథ్యంలో బీఎంఆర్ పార్లమెంటుకు పోటీ చేయమంటే... చేస్తాడా అన్నది సందేహమే!?

క్రికెట్ తర్వాత బెట్టింగ్‌లు ఎక్కువుగా జరిగేది ఎన్నికల ఫలితాల మీదే! నిన్న తెలంగాణ ఎన్నికల ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల పందేలు జరిగాయి.




## లగడపాటి...
# ముంచేసాడు

నెల్లూరుజిల్లాలోనూ ఈ పందేలు పతాక స్థాయికి చేరాయి. ఎన్నికలకు ముందు ఎక్కువమంది టిఆర్ఎస్ విజయంపైనే పందేలు కాశారు. ఒకటికి రెండు వంతున కూడా పందెం కట్టారు. అంటే టిఆర్ఎస్ గెలిస్తే, ఆ పార్టీ మీద పెట్టినవాళ్ళకు లక్షకు లక్ష వస్తాయి. అలాకాకుండా కాంగ్రెస్ గెలిస్తే ఈ పార్టీపై పందెం పెట్టిన వాళ్ళకు లక్షకు రెండు లక్షలు ఇవ్వాల్సి వుంటుంది. ఎన్నికలయ్యాక పలు సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించాయి. స్థానిక, జాతీయ మీడియా సంస్థలన్నీ కూడా తెలంగాణ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కే మెజార్టీని ఇచ్చాయి. అయితే ఆంధ్రా ఆక్టోపస్‌గా పేరుగాంచిన లగడపాటి రాజగోపాల్ మాత్రం కాంగ్రెస్ కూటమికి మెజార్టీ రాబోతుందంటూ తన ఫలితాలను వివరించారు. దీంతో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ మద్దతుదారుల్లో నమ్మకం పెరిగింది. వాళ్ళు ఇతర సర్వేలను నమ్మలేదు. కేవలం లగడపాటి సర్వేపై నమ్మకంతో కాంగ్రెస్ కూటమి గెలుస్తుందంటూ కోట్ల రూపాయలు పందేలు కట్టారు. 9, 10 తేదీలలోనే వందల కోట్ల పందేలు జరిగాయి. లగడపాటి సర్వేను నమ్మే పందేలు కట్టిన వాళ్ళంతా ఇప్పుడు ఫలితాలు చూసి లబోదిబోమంటున్నారు.


నివాళి



1920 2018

మా ఆత్మబంధువు, ఆత్మీయ సింధువు

శ్రీ ఆదాల శంకరరెడ్డి గార్కి

కన్నీటి నివాళి.

నెల్లూరు.

## నెల్లూరులో..
# కాంగ్రెసోళ్ళ సంబరం



నువ్వు పండుగ చేసుకోవాలంటే నిన్ను బాధపెట్టే అంశాలెన్ని వున్నా పక్కన పెట్టు... నిన్ను సంతోషపెట్టే అంశం ఒక్కటి చూసుకో... పండుగ చేసుకో...! నెల్లూరుజిల్లా కాంగ్రెస్ నాయకులు ఈ సూత్రాన్నే పాటించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో కాంగ్రెస్ ఓడుతుందా, గెలుస్తుందా అని చూసారు. మిగతా రాష్ట్రాల ఫలితాలను గురించి అస్సలు పట్టించుకోలేదు. కాని, నెల్లూరుజిల్లా కాంగ్రెస్ నాయకులు మాత్రం తెలంగాణలో ఓటమికి బాధ పడలేదు. దానిని లెక్కలోకి తీసుకోలేదు. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌లలో మేము గెలిచామంటూ నెల్లూరులోని ఇందిరాభవన్ వద్ద సంబరాలు జరుపు కున్నారు. ఔట్లు పేల్చి స్వీట్లు తిన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడు అని చెప్పడానికి ఈ ఫలి తాలు ఒక సంకేతమంటూ ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, శీలం తిరుపయ్య, రఘురాం ముది రాజ్, పత్తి సీతారాంబాబు, భవానీ నాగేంద్రప్రసాద్, డి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా ఉపాధ్యాయురాలికి
# రాష్ట్ర పదవి

విజయవాడలో ఈనెల 9న జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(అపస్) సమావేశంలో రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నెల్లూరు జిల్లాకు చెందిన వింజమూరు జ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే దుకు కృషి చేస్తానని జ్యోతి తెలిపారు.

## నలుబోలుకు
# బెస్ట్ అప్రిసియేషన్ అవార్డు




రాజమండ్రి ఆనం కళాకేంద్రంలో ఈనెల 8,9 తేదీలలో 27వ అంతర్జాతీయ వాకర్స్ కన్వెన్షన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల వాకర్స్ సంఘాలు పాల్గొన్నాయి. 2018 సంవత్సరానికిగాను ఉత్తమ సేవలందించినందుకు నెల్లూరు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌కు రూ.10 వేలు బహుమతి లభించింది. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడిగా ప్రతిభ కనపరచినందుకు నలుబోలు బలరామయ్యనాయుడుకు బెస్ట్ అప్రిసి యేషన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా జరిగిన వాకర్స్ నడక పోటీల్లో అసోసియేషన్ ట్రెజరర్ కొండూరు సుబ్బారావుకు ద్వితీయ బహుమతి లభిం చింది. అవార్డులందజేసిన అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షులు కొండూరి రంగారావు మాట్లాడుతూ వాకర్స్ సభ్యత్వం పెంచడంతో పాటు సేవలను విస్త రించాలని కోరారు. యంవి సుబ్బారెడ్డి, బి.మనోహర్ రెడ్డి, వాకర్స్ సభ్యులు జివి కృష్ణయ్య, చెంచయ్య నాయుడు, ప్రసాద్, శివయ్య, కుమార్ పాల్గొన్నారు.

# ముక్కోటికి ఏర్పాట్లు



తమిళనాడులోని శ్రీరంగం తర్వాత నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం అత్యంత ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి వేడుకలను ఈ దేవస్థానంలో ఘనంగా నిర్వహిస్తుంటారు. శ్రీ రంగనాథుడి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ నెల 18న ముక్కోటి ఏకాదశి. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద భక్తుల దర్శనానికి ప్రత్యేక 'క్యూ'లు ఏర్పాటు చేస్తున్నారు. ఆరోజు తెల్లారు జామున 4.30గంటలకు స్వామివారి ఉత్సవం జరుగుతుంది. 6గంటల నుండి ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామి దర్శనం ప్రారంభమవుతుంది. సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిచ్చే క్రమంలో వివిఐపిలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. అలాగే తొందరగా దర్శనం చేసుకుని పోవాలనుకునేవారి కోసం నూటపదహారు రూపాయల టిక్కెట్లు పెట్టారు. ఆరోజు రాత్రి 10.30 గంటల వరకు కూడా భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## కనుల పండువగా
# అయ్యప్పకు కలశపూజ



నెల్లూరు వేదాయపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న మండల పూజల్లో భాగంగా ఈనెల 10న స్వామివారికి నిర్వహించిన కలశపూజ నేత్రపర్వంగా జరిగింది. శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు పిటీ రంగరాజన్, కార్యదర్శి జి.శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, స్నేహ లతమ్మ, రంగారెడ్డి, అషితమ్మ, వెంకటేష్, సందీప్‌లు వ్యవహరించారు. తొలుత స్వామివారికి పడకేడత్తు పెరుంబడప్పు మన కేశవన్ నంబూద్రిపాద్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, మహాగణపతి హోమం, ఉష పూజ, శీవేలి ఉత్సవం తదితర పూజలు వైభవంగా నిర్వహిం చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# మొక్కలు నాటిన విద్యార్థులు



పచ్చని చెట్లు- ప్రగతికి మెట్లు అనే నినాదంతో ఈనెల 8న డా. కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్‌లో 1 నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా 1012 మొక్కలు నాటారు. పర్యావరణం కాలుష్యానికి గురైందని, కాలుష్యాన్ని కొంతవరకు నివారించేందుకు మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని స్కూల్ డైరెక్టర్స్ డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ తెలిపారు. స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## పక్షుల పండక్కి..
# ముహూర్తం కుదిరింది



జనవరిలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు వస్తాయి. ఇవి తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాల ప్రజలు చేసుకునే పండుగలు. కాని, అదే నెలలో నెల్లూరుజిల్లా వారికి మాత్రమే ప్రత్యేక పండుగ ఇం కోటి వుంది. అదే పక్షుల పండుగ. సూళ్లూరుపేట కేంద్రంగా జరిగే పండుగ. 2000 సంవత్సరంలో అప్పటి కలెక్టర్‌గా వున్న ప్రవీణ్‌కుమార్ ఈ పక్షుల పండుగను మొదలుపెట్టారు. అప్పటినుండి ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా కూడా ప్రతి ఏడాది జనవరి నెలలో ఈ పక్షుల పండుగను ఒక ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. 2019 జనవరి నెలలో 17, 18, 19తేదీలలో పక్షుల పండుగను నిర్వహించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనికి సంబం ధించిన ఏర్పాట్లపై మున్సిపల్ మంత్రి పి.నారాయణ మంగళవారం అధికారులతో చర్చించడం జరిగింది.

## నెల్లూరోళ్ళ..
# శ్రమంతా వృథా!

తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థుల గెలుపు కోసం పని చేయడానికి నెల్లూరుజిల్లా నుండి పలువురు టిడిపి నాయకులు, ముఖ్యంగా ఒక సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తలు భారీగానే వెళ్లారు. ఇక్కడనుండి వెళ్ళినవాళ్ళలో మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌లు కూడా వున్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్ అయితే ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతా లలో ప్రచారం నిర్వహించాడు. నెల్లూరు నుండి వెళ్లిన కార్యకర్తలు కూకట్‌పల్లిలో నందమూరి సుహాసిని గెలుపు కోసం, అలాగే ఖమ్మంలో నామా నాగేశ్వర రావు గెలుపు కోసం బాగానే కష్టపడ్డారు. అప్పుడు హోటల్ రూముల్లో వుంటూ అక్కడే తింటూ పని చేశారు. కాని, ఫలితాలు చూస్తే... వీళ్ళ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీర్రయ్యింది. కనీసం ఛార్జీలు కూడా గిట్టుబాటయ్యే పరిస్థితి లేకుండా పోయింది.

## జాతీయ స్విమ్మింగ్ పోటీలకు
# శివానీరెడ్డి




నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని శివానీరెడ్డి జాతీయ స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 10న మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ కృష్ణ మోహన్ విద్యార్థినిని అభినందించి మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 100 మీటర్ల ఫ్రీ స్టయిల్లో స్వర్ణం, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రజతం, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. ఢిల్లీలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనబోతుం దని తెలిపారు.

# అలీం బాషాకు అస్వస్థత



అలీం బాషాను పరామర్శిస్తున్న మంత్రి పి.నారాయణ

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో వెంటనే నారాయణ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ గుండెవైద్యులు పరీక్షలు నిర్వహించి గుండె రక్తనాళానికి స్టంట్ వేశారు. ఇటీవల పగలు, రాత్రిల్లు పనిఒత్తిడి వల్లే ఆయనకు ఈ స్ట్రోక్ తగిలినట్లుగా తెలుస్తోంది.

# బాబుకు జైలు తప్పదు
## - జనసేన నేత మనుక్రాంత్



ఓటు-నోటు కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డుకు జైలు శిక్ష తప్ప దని జనసేన జిల్లా ఇన్‌ఛార్జ్ మనుక్రాంత్ చెన్నారెడ్డి పేర్కొన్నాడు. నెల్లూరు మినీబైపాస్ లోని జనసేన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కుటిల రాజకీయాలకు తెలంగాణ ప్రజలు తమ ఓట్లతో బుద్ధి చెప్పారని, తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నాడు. చంద్రబాబు కేవలం తన రాజ కీయ ప్రయోజనాలు, తన కొడుకు లోకేష్ భవిష్యత్ కోసమే పని చేస్తున్నాడని, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను, అభివృద్ధిని గాలికొదిలేసాడని ఆయన విమర్శించాడు. రాష్ట్ర అభివృద్ధి అంతా పచ్చమీడియాలో మాత్రమే కనిపిస్తోందని, చంద్రబాబు గ్రాఫిక్ ఇంద్రజాలాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మరని, వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా చంద్రబాబుకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా వున్నారని ఆయన పేర్కొన్నాడు.

## మనోహర్‌రెడ్డికి
# అంతర్జాతీయ వాకర్స్ పదవి



ఆయన తెలుగుదేశం పార్టీ ఆఫీసులో సమన్వయ కర్త.... అలాగే ఒక స్కూల్ నిర్వాహకుడు... అంతేనా ప్రజలలో ఆరోగ్యం పట్ల చైతన్యం కలిగిస్తూ అన్ని జిల్లాల్లో తిరుగుతూ వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తుం టాడు. ఒక వ్యక్తి ఇన్ని పనులు చేయగలడా అనే ప్రశ్నకు సమాధానం మైథిలి స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి. ఇవే కాదు, రోటరీ క్లబ్‌లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ, అలాగే రెడ్‌క్రాస్‌లోని మాగుంట సుబ్బరామరెడ్డి స్పాస్టిక్ సెంటర్ నిర్వహణ చూస్తూ... ఒక మనిషి ఒక రోజులో ఎన్ని వైవిధ్యమైన పనులు చేయొచ్చో చూపిస్తుంటాడాయన. వాకర్స్ అసోసియేషన్‌ల ఏర్పాటులో ఆయన చేసిన కృషికిగాను ఆయనను అంతర్జాతీయ వాకర్స్ రీజనల్ కౌన్సిలర్‌గా నియమించారు. ఇటీవల రాజమండ్రిలోని వెంక టేశ్వర కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ కన్వెన్షన్‌లో ఆయనకు ఈ బాధ్యత అప్పగించారు.

# ప్రజలకు సేవ చేసేందుకే...
# రాజకీయాల్లోకి వచ్చా

**- ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



సైదాపురం మండలం చీకవోలు గ్రామంలో ఆర్.ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జ్ ఆనం రామనారాయణరెడ్డి తదితరులు

ప్రజల సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ప్రముఖ వదాన్యుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండలంలోని చీకవోలు గ్రామంలో ఈనెల 8న గ్రామస్తులకు ఎంపీల్యాడ్స్‌తో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటికి కటకటలాడే ప్రజలకు పరిశుద్ధమైన నీరందించే ఈ కార్యక్రమం తనకెంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను తీర్చేందుకు తనవంతు కృషిచేస్తున్నానని, ఈ ప్రాంతంలోని కలిచేడు గ్రామంలో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న పాఠశాల దుస్థితిని, మూతపడివున్న ఆసుపత్రి విషయాన్ని కేంద్రకార్మికశాఖ మంత్రితో, ఆ శాఖ కమిషనర్‌తోనూ సంప్రదించి ఈ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేయకపోవడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇక్కడ మూతపడివున్న 30 పడకల ఆసుపత్రిని పునరుద్ధరించేందుకు, ఈ ప్రాంతాల్లోని కార్మికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విపిఆర్‌తో పాటు వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపి సమన్వయకర్త, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పొట్టేళ్ళ శిరీషా, మాజీ ఎంపిపి రవికుమార్, సిహెచ్ బాలకృష్ణారెడ్డి, పట్టాభిరామిరెడ్డి, మాజీ సర్పంచ్ సజ్జ రమణయ్య, సింహపురి ఆసుపత్రి అధినేత రవీంద్రరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ శంకర్, వైఎస్సార్సీపి మండల అధ్యక్షుడు కమలపూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చల్లటూరు గ్రామంలో...

రాపూరు మండలంలోని చల్లటూరు గ్రామంలో ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌కు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, ఎంపిల్యాడ్స్ నుంచి, మరియు విపిఆర్ ఫౌండేషన్ నుంచి 23 మండలాల్లో సుమారు 70కి పైగా ఆర్ఓ ప్లాంట్స్‌ను మంజూరుచేయడం జరిగిందన్నారు. అందరూ ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కండలేరు జలాశయం రాపూరు మండల పరిధిలో ఉన్నా మండలంలోని పలు గ్రామాల్లో తాగేందుకు నీరు లేకపోవడం బాధాకరమన్నారు. కండలేరు జలాశయం నీటితో ఆయా గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు సంబంధిత అధికారులతో సంప్రదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకుడు రమణారెడ్డి, మండల కన్వీనర్ బండి కృష్ణారెడ్డి, పట్టాభిరామిరెడ్డి, మధు సూదన్‌రెడ్డి, నీలం బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నార్త్ కొండాయపాళెంలో...

వరికుంటపాడు మండలంలోని నార్త్ కొండాయపాళెంలో ఎంపీల్యాడ్స్‌తో ఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంట్‌కు, వరికుంటపాడులో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంట్‌కు అదేరోజున రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఆత్మకూరు-ఉదయగిరి నియోజకవర్గాలకు తాగునీరు, సాగునీరు సమస్య లేకుండా చేయాలంటే వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తిచేయడమే ఏకైక పరిష్కారమార్గమన్నారు. జిల్లాలో ఫ్లోరైడ్ బాధ పోవాలన్నా, ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు లభించాలన్నా ఆ ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే జిల్లాలోని ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన 65వేల ఎకరాలకు సాగునీటితో పాటు 1.5 లక్షల మంది ప్రజలకు మంచినీటి సమస్య తీరుతుందని, డా.వైఎస్ ఉండివుంటే ఈ ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయివుండేదన్నారు.



వరికుంటపాడు మండలం నార్త్‌కొండాయపాళెంలో...

రానున్న కాలంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇలాంటి ప్రాజెక్టులను పూర్తిచేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి బాలకృష్ణ, నాయకులు నాగభూషణం, బాలకృష్ణారెడ్డి, బాలగురువారెడ్డి పాల్గొన్నారు.

## పొగాకు రైతుల పరిస్థితి దయనీయం - విపిఆర్



పొగాకు అధికారులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మర్రిపాడు మండలంలోని డిసిపల్లి గ్రామాన్ని ఈనెల 8న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించి అక్కడ పొగాకు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, జిల్లాలో పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, జిల్లాలో 4వేల మంది పొగాకు రైతులు 8వేల హెక్టార్లలో పొగాకును సాగుచేస్తున్నారని, అయితే ప్రతిఏటా వర్షాభావంతోనో, లేదా గిట్టుబాటు ధరలు లేకపోవడమో.. ఇతరత్రా కారణాలతోనో రైతులు నష్టపోతూనే ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. పొగాకు రైతులకు ప్రత్యామ్నాయపంటలైన జొన్న, సజ్జ, కంది, పెసలు, మినుము, రాగి వగైరాలను సాగుచేసే విధంగా సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. పొగాకు సాగు వదులుకోవడానికి సిద్ధంగా ఉన్న రైతులకు ఒక్కో బ్యారన్‌కు కనీసం 10 లక్షలు పరిహారం వచ్చేవిధంగా కేంద్రమంత్రితో సంప్రదిస్తామని ఆయన రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ సుధాకర్‌రావు, సూపరింటెండెంట్ లక్ష్మణరావు, రైతునాయకులు నరసప్ప నాయుడు, బాలవెంగళరెడ్డి, దామా సుబ్బారావు, యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమం... మా లక్ష్యం

**సేద్యం మంత్రి సోమిరెడ్డి**

పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందంటున్నాడు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ఈ నెల 10వ తేదీన ముత్తుకూరు ఎంపిడిఓ కార్యాలయంలో 126మంది వితంతు మహిళలు, మత్స్యకారులకు మంజూరైన పింఛన్‌లను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పేదప్రజలను ఆదుకునేందుకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌లను అందజేస్తున్నామన్నారు. వితంతువులు, వృద్ధులతో పాటు 50ఏళ్ళు నిండిన గీత కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకారులకు నెలవారీ పింఛన్‌లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఒక్క ముత్తుకూరు మండలంలోనే ఇప్పటివరకు 5,807 మందికి 63.28 లక్షల రూపాయల మేరకు నెలవారీ పింఛన్‌లు అందజేస్తున్నామని చెప్పారు. ఈరోజు పంపిణీ చేస్తున్న 126 పింఛన్‌లలో 97మంది ఒంటరి మహిళలు కాగా, 24మంది మత్స్యకారులున్నారని చెప్పారు. ముత్తుకూరు మండలంలో చంద్రన్న పెళ్లికానుక క్రింద 59మందికి 18లక్షల రూపాయలు, చంద్రన్న బీమా క్రింద 250మందికి 3.30 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నీటి సంఘం అధ్యక్షులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, టిడిపి నాయకులు దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఎంఇఓ మధుసూదన్, వ్యవసాయ అధికారి హరికరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళా ఉద్యోగుల విజయగాథలపై..
# మాండెలెజ్ పరిశ్రమకు ప్రశంసలు



సదస్సులో మాట్లాడుతున్న పి.కృష్ణచైతన్య

న్యూఢిల్లీలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించిన ఎకనామిక్స్ టైమ్స్ ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ ప్యాకేజింగ్ సమ్మిట్-2018లో శ్రీసిటీలోని మాండెలెజ్ (క్యాడ్ బరీస్ చాక్ లెట్) పరిశ్రమ అందరి ప్రశంసలు అందుకుంది. ఈ పరిశ్రమలో గ్రామీణ మహిళలను ఎంపిక చేసుకుని వారిని ఉత్తమ మహిళా ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఆలోచనను పలువురు ప్రశంసించారు. ఈ సదస్సులో 'శ్రీసిటీలో మహిళా ఉద్యోగుల విజయగాథ, మార్పు' అనే పేరుతో ఒక కేస్ స్టడీని మాండెలెజ్ పరిశ్రమ పీపుల్ ఎక్సుర్ట్ పి.కృష్ణచైతన్య ప్రదర్శన ఇచ్చాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల నుండి పారిశ్రామిక అనుభవం లేని ఉన్నత పాఠశాల విద్యార్థినులు నైపుణ్య శిక్షణ పొంది పెద్దపెద్ద యంత్రాలతో ఎలా పనిచేస్తారనేది వివరించారు. మహిళా ఉద్యోగులను సురక్షితంగా ఉంచి మంచి వాతావరణంలో పనిచేసేందుకు మాండెలెజ్ చూపుతున్న శ్రద్ధను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. పరిశ్రమ వారు అవలంభిస్తున్న వివక్షత లేని ఉద్యోగి ఆధారిత పద్ధతులు ఇక్కడ మహిళా ఉద్యోగులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయన్నారు. గత నెలలో శ్రీసిటీలోని మాండెలెజ్ ఇండియా ప్లాంట్‌కు చెన్నైకు చెందిన అవతార్ గ్రూప్, అమెరికా ఆధారిత వర్కింగ్ మదర్ ఇండియా సంస్థల ద్వారా మహిళల ఉత్తమ సంస్థ అవార్డు రావడం గమనార్హం.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## ఇంజనీరింగ్ విద్యార్థులు..

# ప్రతిభాపాటవాలతో ముందుకు సాగాలి

### అమర్‌రాజా బ్యాటరీస్ వైస్‌ప్రెసిడెంట్ జగన్‌మోహన్



ఇంజనీరింగ్ విద్యార్థులు పారిశ్రామికరంగంలో సవాళ్ళను అధిగమిస్తూ ప్రతిభా పాటవాలతో సమర్ధవంతగా ముందుకు సాగాలని అమర్‌రాజా బ్యాటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ జగన్‌మోహన్ అన్నారు. విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల ముగింపురోజున ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వినూత్న సృజనాత్మక సాంకేతిక ఆవిష్కరణలకు తగ్గట్టుగా భావి ఇంజనీర్లు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇడిఎస్ టెక్నాలజీస్ డిజిఎం కళాధర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వారి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇలాంటి శిక్షణాతరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎంతో విజ్ఞానదాయకమైన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డా. విక్రమ్‌కుమార్, కోఆర్డినేటర్ రామకృష్ణ, వెంకటేశ్వర్లుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



## అంబేద్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు రూరల్ పొట్టేపాలెంలోని ఆయన విగ్రహానికి తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గంథం మహేష్, ముత్యాల రంగయ్య, సిహెచ్ సూరి, ఉప్పాల రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

# నీళ్ళిచ్చి.. రైతులను నిలబెట్టండి

### కలెక్టర్‌ను కోరిన బీద



శాసనమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర 11వ తేదీ నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ముత్యాలరాజును కలిశారు. కావలిలోని రామన్నచెరువుకు సాగునీళ్ళు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. సాగునీరు లేకపోవడంతో రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా వున్నాయని ఆయన కలెక్టర్‌కు వివరించారు. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల క్రింద వున్న చెరువులకు సాగునీరు, తాగునీటికి సంబంధించి షెడ్యూల్ విడుదల చేయాలని బీద రవిచంద్ర ఈ సందర్భంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## గూడూరు రూరల్ సిఐ అక్కేశ్వరరావు బదిలీ అయ్యారు

గూడూరు రూరల్ సిఐ అక్కేశ్వరరావును రేంజ్ విఆర్‌కు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి కేవివి గోపాల్‌రావు తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో రేంజ్ విఆర్‌లో ఉన్న వంశీధర్‌ను నియమించారు. సిఐలు వెంటనే తాము బదిలీ అయిన ప్రాంతాల్లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు.

### ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్

# రాష్ట్ర అధ్యక్షుడిగా రియాజ్ అహ్మద్



ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షులు రియాజ్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గూడూరు పట్టణానికి చెందిన షేక్ రియాజ్‌అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 9న విజయవాడలో నిర్వహించిన పంచాయితీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఈ ఎంపిక చేసారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పీఆర్ డిప్లొమో ఇంజనీర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానంటూ, తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన అందరికీ రియాజ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా!

### - శ్రీ కోదండరామాంజనేయస్వామి దేవస్థానం ఛైర్మన్ బత్తిన సుధాకర్



గూడూరు పట్టణంలోని శ్రీ కోదండరామాంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆలయ కమిటి ఛైర్మన్ బత్తిన సుధాకర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఓ కార్యాలయంలో దేవస్థాన కమిటి ఛైర్మన్‌గా నియమితులై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సద్దాం, హయాత్, సన్నీ, సమీర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 10వ తేదీ గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో హౌస్ ఫర్ ఆల్ పథకం ద్వారా ఎన్‌టిఆర్ నగర్‌లో నిర్మించిన అపార్టుమెంట్ ఇళ్ళకు ఎంపికైన 900 మంది లబ్దిదారులకు లాటరీ సిస్టమ్ ద్వారా ఇళ్ళు కేటాయిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు

## గూడూరు డివిజన్ వార్తలు

# సమసమాజ స్థాపనకే...



కరపత్రాలను అందజేస్తున్న జనసేన యువనాయకులు

గూడూరు పట్టణంలో జనసేన జనతరంగం కార్యక్రమం నిరాడంబరంగా కొనసాగుతోంది. ఈనెల 9న పార్టీ నాయకులు పలు ప్రాంతాల్లో హామీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ వాటిని గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు తీగల చంద్రశేఖర్, నయాలు మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపి సమసమాజాన్ని స్థాపించేందుకే జనసేన ఆవిర్భవించిందన్నారు. తమ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయదగినవేనన్నారు. అశోక్, ధనుంజయ, ఇమ్రాన్, సూర్య, చందు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌తోనే పేదల సంక్షేమం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మేరిగ మురళి

రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైకాపాని ఆశీర్వదించాలని, జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే పేదలందరికీ మేలు జరుగుతుందని వైకాపా గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళి తెలిపారు. గూడూరు పట్టణంలోని 14వ వార్డులో 'రావాలి జగన్ - కావాలి జగన్' కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ వైకాపా నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించాలనే లక్ష్యంతో జగనన్న ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి, తాళ్ళూరు శ్రీనివాసులుయాదవ్, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా, ఆముదాలవలస మండలంలోని నందగిరిపేట గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డితో కలిసి ఈ నెల 10వ తేదీ పాదయాత్రలో పాల్గొన్న గూడూరు వైయస్సార్ పార్టీ నాయకులు బత్తిన విజయకుమార్.

# వృద్ధులకు చేయూత



వృద్ధులకు ట్రై సైకిళ్ళను అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్

నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 9న వృద్ధులకు చక్రాల కుర్చీలు, ట్రైసైకిళ్ళను అందజేశారు. జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తామన్నారు. జేవీవీ ప్రతినిధులు చెంచు నారాయణ, పురుషోత్తం, విష్ణు, రూప్‌కుమార్, గోపి, సాయికిరణ్, జగదీష్, శంకర్‌లు పాల్గొన్నారు.

# కూటమి ఓటమికి ఆ తప్పే కారణం

గల్పిక

తేది10 డిసెంబర్ 2018... హైటెక్ రత్న చంద్రబాబు రక్తాన్ని చెమటగా మార్చి, ఇటుక ఇటుకకు మధ్యలో సిమెంట్ పూసి కట్టించిన హైదరాబాద్ నగరం. కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం గాంధీ భవన్... ఆఫీసులో పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జీవన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దామోదరం రాజనరసింహ, వి. హెచ్. హనుమంతురావులు సమావేశమై వున్నారు. అప్పుడే అక్కడకు కర్నాటక మంత్రి డి. కె. శివకుమార్ వచ్చాడు. ఉత్తమ్‌కుమార్ ఆయనను తన పక్కనే కూర్చోబెట్టుకుని మిగిలిన నేతలకు పరిచయం చేస్తూ... ఈయన డి. కె. శివకుమార్ గారు... ఎమ్మెల్యేల క్యాంపులు నిర్వహించడంలో మంచి ఎక్స్‌పర్ట్. రేపు ఫలితాలు వస్తున్నాయి... పోటాపోటీగా సీట్లు వస్తే మన ఎమ్మెల్యేలు చేజారి పోకుండా క్యాంప్‌లు నిర్వహించేందుకు హైకమాండ్ ఈయనను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. ఒకవేళ మన కూటమికి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి నాలుగైదు సీట్లు తగ్గాయనుకోండి... ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలను, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనడానికి ఆ సబ్జెక్ట్‌లో ఏంఏ, ఎంఫిల్ చేసిన చంద్రబాబు రంగంలోకి దిగుతారు అని చెప్పాడు. అప్పుడు వి. హెచ్. హనుమంతురావు... ఇవన్నీ తర్వాత ముందు సీఎం అభ్యర్థిని ఎలా డిసైడ్ చేయబోతున్నారో చెప్పండి అని అడిగాడు. అందుకు మళ్ళీ ఉత్తమ్‌కుమారే బదులిస్తూ... సీఎం రేసులో వున్న అభ్యర్థుల పేర్లన్నీ చీటీల మీద వ్రాసి ఒక డబ్బాలో వేస్తాం, నేను పిసిసి అధ్యక్షుడిని కాబట్టి నా పేరుతో వున్న చీటీలు రెండు వేసుకుంటాను, రాహుల్‌గాంధీ వచ్చి ఈ చీటీలలో ఒక చీటీ ఎత్తుతాడు. ఎవరి పేరొస్తే వాళ్ళే సీఎం అని చెప్పాడు. అందరూ ఆ ప్రపోజల్‌కు చప్పట్లు కొట్టి ఆమోదం తెలిపారు.

★★★★★


తేది 11 డిసెంబర్ 2018... సమయం ఉదయం 11గంటలు... గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సీనియర్ కాంగ్రెస్ నేతలంతా కూర్చునివున్నారు. ఉత్తమ్ ముందు ఆ ముందురోజు వ్రాసుకున్న సీఎం అభ్యర్థుల చీటీల డబ్బా వుంది. పక్కనే వున్న పొన్నాల లక్ష్మయ్య... ఉత్తమ్, ఒక తెల్లకాగితం వుంటే ఇస్తావా, చిన్న లెక్క వ్రాసుకోవాలని అన్నాడు. వెంటనే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన ముందున్న డబ్బాలోని చీటీలన్నీ ఆయన ముందు పోసి... ఎన్ని కాగితాలు కావాలంటే అన్ని కాగితాలు తీసుకోండని విసురుగా చెప్పాడు. అంతలో అక్కడకు కర్నాటక మంత్రి డి. కె. శివకుమార్ వచ్చాడు. రాగానే బెంగుళూరులోని లీలా గ్రాండ్ ప్యాలెస్ వాళ్ళు ఫోన్‌లు చేస్తున్నారు. క్యాంప్ పెట్టడానికి అందరికీ రూమ్‌లు బుక్ చేశాను కదా... ఓ 50లక్షలు అడ్వాన్స్ ఇస్తే వాళ్ళకు పంపిస్తాను అని అడిగాడు. ఉత్తమ్ తోక తొక్కిన తాచుపాములా లేచి... ఇంకేం క్యాంపు, ఇంకేం ప్రభుత్వం, అవ్వాల్సిం దంతా అయిపోయింది. కారు క్రింద హస్తం నలిగిపోయింది అంటూ వలవల ఏడ్చాడు. రిజల్ట్స్ ఏమయ్యాయి అని శివకుమార్ అడిగాడు. ఇదిగో చూడు అంటూ పొన్నాల లక్ష్మయ్య టీవీ ఆన్ చేశాడు. టీవీ 10.5 స్క్రీన్‌పై టిఆర్ఎస్ 88, కాంగ్రెస్ 19... ఆ సీన్ చూడగానే శివకుమార్‌కు పరిస్థితి అర్ధమైపోయింది. ఇక నా అవసరం లేదనుకుంటాను... ఫ్లైట్ టిక్కెట్ బుక్ చేస్తే బెంగుళూరుకు వెళ్ళిపోతానన్నాడు. ఉత్తమ్‌కుమార్ వెంటనే జేబులో నుండి వంద రూపాయలు తీసి శివకుమార్ చేతిలో పెట్టి ఒంటి గంటకు బెంగుళూరు ప్యాసింజర్ వుంది, దాంట్లో ఎక్కి పోండి అని కసురుగా చెప్పాడు. శివకుమార్ అందుకు కనీసం 'కారు' అన్నా బుక్ చేయండి అని అడిగాడు. ఆ కారు మాటెత్తొద్దు అంటూ ఉత్తమ్‌కుమార్ కస్సున లేచాడు. శివకుమార్‌కు పరిస్థితి అర్ధమై అక్కడ నుండి బయటకొచ్చేసాడు.

అంతలో గాంధీభవన్ ఆవరణలో హడావిడి కనిపించింది. అంత బాధలోనూ కాంగ్రెస్ నేతలంతా బయటకు వచ్చారు. అక్కడ చూస్తే హైటెక్ రత్న చంద్రబాబు నాయుడు వున్నాడు. ఆయన వెనుక మీడియా వాళ్ళున్నారు. వాళ్లంతా... సార్, ప్రజాఫ్రంట్ ఓటమికి ప్రధాన కారణమేంటి? అని ప్రశ్నించారు. దానికి చంద్రబాబు... మావైపు నుండి పెద్ద బ్లండర్ జరిగిపోయింది. దానివల్లే ఓటమి అని చెప్పాడు. ఏంటా బ్లండర్ అని మీడియా వాళ్ళు ఒకవైపు అడుగుతుండగా... చంద్రబాబు మాత్రం అక్కడున్న కాంగ్రెస్ నేతలవైపు కోపంగా చూస్తూ... ఏం ఉత్తమ్‌కుమార్ నువ్వైనా చెప్పబల్లేదా... ఏం హనుమంతురావు నువ్వు సీనియర్‌వి, నీకైనా తెలియదా... రేవంత్... మన గురించి అన్నీ తెలిసిన వాడివి, ఇంత బ్లండర్ జరుగుతుంటే నువ్వేమన్నా గాడిదలు కాస్తున్నావా అంటూ వారిపై చిందులు తొక్కసాగాడు. అసలే ఫలితాలు అవతారంగా వచ్చాయి. ఈ చంద్రబాబు పొత్తుతోనే తాము మునిగిపోయామని కాంగ్రెస్ నాయకులు లోలోన ఉడికిపోతున్నారు. ఇప్పుడు చంద్రబాబు వచ్చి వేస్తున్న కేకలతో ఉత్తమ్‌కుమార్‌కు కోపం నషాళానికి అంటింది. కోపంతో అతను... ఆ బ్లండర్ ఏంటో చెప్పి ఏడవండి అని అడిగాడు. తెలంగాణలో ప్రచారానికి సోనియా వచ్చిందా... రాహుల్ వచ్చాడా... నేను తిరిగానా... మా బాలయ్యా తిరిగారా... నువ్వు తిరిగావా... సిపిఐ నారాయణ తిరిగాడా... కాని ఇంతమంది తిరిగి ఏం లాభం... అసలు తిరగాల్సినవాడు తిరిగితేగా... అదే మనవైపు జరిగిన పెద్ద బ్లండర్ అని అన్నాడు. ఆ స్టార్ క్యాంపెయినర్ ఎవరో చెప్పి పుణ్యం కట్టుకోండని ఉత్తమ్‌కుమార్ రెండు చేతులు జోడించి అడిగాడు. ఇంకెవరూ మా లోకేష్... అతని చేత ప్రచారం చేయించడం అందరం మరచిపోయాం... అందుకే ఓటమిపాలయ్యాం అని చంద్రబాబు చెప్పాడు. ఆ మాటకు ఉత్తమ్‌కుమార్... హహహ... అంటూ నవ్వసాగాడు. అలా గంటలపాటు నవ్వుతూనే వున్నాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న కాంగ్రెస్ నాయకులు వెంటనే 108 అంబులెన్స్‌ను పిలిపించి ఆయనను అపోలో ఆసుపత్రికి తీసుకుపోయారు.

---

## ధర్మసూక్ష్మాలను వివరంగా బోధించే..

# శ్రీ మహాభారతము – 'వనపర్వము'




**శ్రీమహాభారతము**
**(వనపర్వము)**
**వెల: రూ.400/-** **పేజీలు : 960**
**ప్రతులకు :**
**గీతా ప్రెస్**
**గోరఖ్‌పూర్ - 273005.**
**ఫోన్: 0551-2334721.**

ఏడు సంపుటాల శ్రీ మహాభారతంలో రెండవ సంపుటం వనపర్వం ఇటీవలే విడుదలైంది. 960 పుటలతో గోరఖ్‌పూర్‌లోని గీతాప్రెస్‌వారు ఈ సంపుటాన్ని ముద్రించారు. వారి ముద్రణాస్థాయికి తగ్గట్టు ఎంతో అందంగా ఈ సంపుటం పాఠకులకు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందించదగ్గ విషయం.

ప్రముఖ సారస్వతవేత్తలైన డాక్టర్ అప్పాభట్ల రామకృష్ణమూర్తి గారు, నెల్లూరీయులైన ప్రముఖ సాహితీవేత్తలు డా. సూరం శ్రీనివాసులు గార్లు రచించిన ఈ రెండవ సంపుటము పాఠకులకు కరదీపిక వంటిదని వేరే చెప్పనక్కరలేదు.

తెలుగు భారతంలో అరణ్యపర్వమని వ్యవహరించే పర్వమే సంస్కృతంలో 'వనపర్వం'గా ప్రఖ్యాతమైంది. పాండవుల వన గమనంతో ప్రారంభమైన ఈ పర్వం అజ్ఞాతవాసం కోసం పాండవులు తమ పురోహితుడైన ధౌమ్యునితో కలసి ఆలోచించడంతో ముగుస్తుంది. 22 అవాంతర పర్వాలు, 315 అధ్యాయాలు, 11,979 పద్యగద్యాలు దీనిలో విషయవ్యాప్తికి ఆధారాలు. ఈ పర్వమే తెలుగులో 2901 పద్య గద్యాల అరణ్యపర్వమైంది.

ఈ వన పర్వ ప్రాశస్త్యాన్ని సంపాదకులు డాక్టర్ అప్పాభట్ల రామకృష్ణమూర్తిగారు, డా. సూరం శ్రీనివాసులుగారి మాటల్లో చెప్పాలంటే, "వ్యాస భగవానుని మహాభారత ప్రణాళిక చాలా విశిష్టమైనది. కౌరవ పాండవుల చరిత్ర చెపుతూనే చాలా చోట్ల ధర్మార్థ కామమోక్షాలకు సంబంధించిన విశేషాలు చెప్తూ ఉంటాడు. ఇది వ్యాసుని సామాన్య ప్రణాళిక. అలా కాక, కథను మించి ఈ చతుర్వర్గానికి ప్రాధాన్యమిచ్చిన స్థలాలు కూడా ఉన్నాయి భారతంలో. అవి వనపర్వం, భీష్మపర్వం, శాంతిపర్వం, అనుశాసన పర్వం. వీటిలో కథ తక్కువ–ఉపదేశం ఎక్కువ. ఈ ఉపదేశ ప్రాధాన్యంతోనే వ్యాసుడు జనహితాన్ని సాధించాడు. నన్నయ చెప్పిన విశ్వజనీనతలోని భావం ఇదే"..

పాండవుల పుష్కరకాలపు అరణ్యవాస జీవితాన్ని ఈ వనపర్వం అందిస్తుంది. పాండవుల అరణ్యవాసంతోనే పర్వమంతా నిండిపోతే మరి ఆ పన్నెండు సంవత్సరాలు కౌరవులు ఏం చేస్తున్నట్టు?..వారి ప్రస్తావన అవసరం లేదా?..


డా.అప్పాభట్ల రామకృష్ణమూర్తి


డా. సూరం శ్రీనివాసులు

అందుకే, వనపర్వంలో పేరుకు పాండవుల అరణ్యవాసమైనా, కౌరవులు తెచ్చిపెట్టుకున్న అరణ్యవాసం, దాని ప్రాణాల మీదకు తెచ్చుకోవడం కనిపిస్తుంది. పాండవులు కష్టపడుతుంటే చూసి నవ్వుకోవాలని కౌరవులు రావడం (ఘోషయాత్ర పేరుతో) గంధర్వుల చేతికి చిక్కడం, తిరిగి పాండవులే వారిని విడిపించవలసిరావడం, సైంధవుడు మోహంతో ద్రౌపదిని అపహరించడం, భీమార్జునులు వెంటబడగా తిరిగి యుధిష్టిరునే ఆశ్రయించడం ఈ పర్వంలోని విశేషాలే.

మరో ఇతిహాసమైన రామాయణ కథ, భారత కథలలో ప్రధానమైనవి సావిత్రి చరిత్ర, కర్ణ జననం, నలోపాఖ్యానం, అర్జునుని పాశుపతాస్త్ర సంపాదన, తీర్థయాత్రా వర్ణన, ధర్మవ్యాధోపాఖ్యానం ఈ వన పర్వం లోనివే. నిత్యజీవితంలో మనకు తారసపడే అనేక సంశయాలు, వాటికి సమాధానాలు ధర్మ సూక్ష్మరూపంలో ఈ పర్వంలోనే కనిపిస్తాయి.

భ్రాతృధర్మం, సోదరుల మధ్య ఉండవలసిన సంబంధం. ఇతరులు మన జోలికి వచ్చినప్పుడు మనం 105 మందిమి ఒకటే అని ధర్మజుని ఉద్బోధ. హింసాహింసల విషయ విశ్లేషణ, సత్యాసత్య పరామర్శ మొదలైన నైతిక ధర్మసూత్రాలు (ధర్మవ్యాధుని ద్వారా) ఇక్కడ తెలుస్తాయి.

**యద్ భూత హిత మత్యన్తం తత్సత్యమితి ధారణా!**
**విపర్యయకృతో2ధర్మ: పశ్య ధర్మస్య సూక్ష్మతామ్!!**
(209–4)..

ఈ శ్లోకంలోని ధర్మసూక్ష్మం.. 'సత్యాన్ని ప్రమదితవ్యమ్' అన్న ఉపనిషద్వచనాలతో అనుసంధించుకొనవలసినది.


భారతాంధ్రీకరణంలో ఎర్రన ఈ శ్లోకాన్నే అందంగా అనువదించి తెలుగువారికి కానుకగా అందించారు.

**భూతహితంబుగా బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చు ద**
**ద్భూత భయావహంబగు బ్రభూతపు సత్యము బొంకునట్ల! ప్రా**
**ణాతురుడైనచో బరిణయంబున యందును బల్కు బొంకు స**
**త్యాతిశయంబ యండ్రు మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్!....**

ఇందులో 3–4 పాదాల్లోని విషయానికి 209–3 శ్లోకం మూలం. అయితే, ఆ విషయంలో శుక్రబోధ (భాగవతంలోనిది) ప్రసిద్ధమైంది.

**వారిజాక్షులందు వైవాహికములందు**
**బ్రాణ విత్త మానభంగమందు**
**జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు**
**బొంకవచ్చు నఘము బొందదధిప!....**

ఆ తరువాత జరుగబోయే భారతకథకు ఈ పర్వంలోనే పునాదులు పడతాయి.



సమీక్షకులు:
**అవధాని శ్రీ కోట రాజశేఖర్**
నెల్లూరు. ఫోన్ : 9966236604

## ఎంతగొప్ప ప్రవాహమైనా.. చిన్న నీటిబొట్టుతోనే ప్రారంభమవుతుంది!

# కస్తూరిదేవి ప్రస్థానం కూడా.. చిన్నచిన్న అడుగులతోనే ఆరంభమైంది

కస్తూరిదేవి బాలికల హాస్టల్‌ను అందంగా తీర్చిదిద్దుతూ.. హాస్టల్‌కు ప్రహరీగోడ నిర్మిస్తే బావుంటుందనే ఆలోచన రావడంతో విద్యాలయం కమిటీ ఈ విషయం చర్చించేందుకు నవమావేశమైంది. 1950లో జరిగిన ఆ కమిటీ సమావేశంలో కస్తూరిదేవి బాలికల హాస్టల్ భవనానికి ప్రహరీగోడ నిర్మించాలని కమిటీ తీర్మానించింది.

అందుకు అప్పట్లో ఖర్చు సుమారు 2,350 రూపాయలవుతుందని అంచనా వేశారు. కమిటీ సభ్యులు శ్రీయుతులు ఆర్. దశరథరామిరెడ్డి, తిక్కవరపు రామిరెడ్డి, ఇ.సుందర రామిరెడ్డి, ఎం. ఆదిశేషారెడ్డి, శ్రీమతి పొణకా కనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, ఎం.హేమలత గార్లు సమావేశమై ఆ మేరకు తీర్మానం చేశారు. అదే విధంగా 20-7-1951న జరిగిన సమావేశంలో ఈ విద్యాలయానికి కొత్త స్కూల్ బిల్డింగ్‌ను నిర్మించాలని కూడా తీర్మానించుకుని ఆ పనులను అనుకున్న మేరకు క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. ఇలా కమిటీ వారి ఆధ్వర్యంలో కస్తూరిదేవి విద్యాలయం, హాస్టల్ భవనం వగైరాలు క్రమేణా అభివృద్ధి చెందుతూ వచ్చాయి.

> కస్తూరిదేవి విద్యాలయానికి కొత్త స్కూల్ బిల్డింగ్‌ను నిర్మించాలని కూడా అప్పట్లో కమిటీ వారు తీర్మానించుకుని ఆ పనులను అనుకున్న మేరకు క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. అలా కస్తూరిదేవి విద్యాలయం, హాస్టల్ భవనం వృద్ధి చెందుతూ వచ్చాయి.

ఎంత గొప్ప ప్రవాహమైనా చిన్న నీటిబొట్టుతోనే ఆరంభమవుతుంది. ఎంత పెద్ద యాత్ర అయినా..ఒక చిన్న అడుగుతోనే ప్రారంభమవుతుంది. కస్తూరిదేవి విద్యాలయం ప్రస్థానం కూడా అంతే. ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ అంచలంచలుగా ముందుకు సాగింది. బాలికల చదువుకోసం విద్యాలయం నిర్మాణం గావించాలనే ఏదేక లక్ష్యంతో.. ఎంతో వ్యయప్రయాసలతో నాటి మహనీయుల నిరంతర కృషితోనే ఈ సరస్వతీనిలయం ఇక్కడ ఆవిర్భవించింది. ఇప్పుడు ఈ విద్యాలయంలో మనం చూసే భవనాలు వగైరాలన్నీ అప్పట్లో అప్పటికప్పుడు వచ్చినవేమీ కాదు. వాటి వెనుక ఎంతో కష్టం ఉంది. కృషి-పట్టుదల-శ్రమ ఉన్నాయి.

ఇటుక ఇటుక పేర్చుకుంటూ..కష్టనష్టాలన్నిటినీ అధిగమిస్తూ.. శ్రీమతి పొణకా కనకమ్మగారు, శ్రీయుతులు తిక్కవరపు రామిరెడ్డిగారు, డా. బెజవాడ గోపాలరెడ్డిగారు, ఆనం పద్మనాభరెడ్డి గారు, రేబాల దశరథరామిరెడ్డిగారు, ఎం.ఆదిశేషారెడ్డిగారు, మేనకూరు బలరామరెడ్డిగారు, వేమారెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ గారు... ఇలా ఎందరో మహానుభావులు.. సమాజసేవాభిలాషులు..వదాన్యులందరి సహాయ సహకారాలతో.. సింహపురి ప్రజల ఆశీర్వాదాలతో ఈ విద్యాలయం క్రమేణా అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ అభివృద్ధిలోకి వచ్చింది. అప్పట్లో చిన్నచిన్న కట్టడాలతో ప్రారంభమైన ఈ విద్యాలయం.. ఆ తరువాత పెద్ద భవనాల నిర్మాణాల దాకా సాగిందంటే... ఇదంతా నాటి మహనీయుల పుణ్యమే!...

## ఇదీ.. 6 కస్తూరిదేవి కథ



## విద్యాలయం అభ్యున్నతే అందరి లక్ష్యం...

ఆ తర్వాత 1952లో కస్తూరిదేవి విద్యాలయం కమిటీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తిక్కవరపు రామిరెడ్డిగారు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆనం పద్మనాభరెడ్డిగారు సెక్రటరీ, కరెస్పాండెంట్ మరియు కోశాధిపతిగా ఎన్నికయ్యారు. ఆమేరకు కొత్తకమిటీ ఎన్నికైన 2-9-1952న జరిగిన సమావేశంలో సభ్యులు తిక్కవరపు రామిరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, ఏ.పద్మనాభరెడ్డి, ఆర్.దశరథరామరెడ్డి, ఎం.ఏ శేషారెడ్డి గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, కొత్త స్కూల్ బిల్డింగ్‌లో మెయిన్‌హాల్‌కు ప్రముఖ వదాన్యులు 'శ్రీ రేబాల పట్టాభిరామరెడ్డి హాల్'గా నామకరణం చేయాలని అందరూ కలిసి నిర్ణయించుకున్నారు.

అప్పట్లో అందరి ఆలోచనలు విద్యాలయం అభ్యున్నతిపైనే ఉండేవి. ఇంకా ఏమిచేస్తే విద్యాలయం మరింత వృద్ధిలోకి వస్తుందనే విషయంపై అనేకసార్లు కమిటీలోని ప్రముఖులంతా కలిసి ఆలోచనలు సాగించేవారంటే వారికి ఈ విద్యాలయం పట్ల ఎంత అభిమానం ఉండేదో తేటతెల్లమవుతుంది. ఈ నేపథ్యంలో విద్యాలయానికి సంబంధించిన అనేక విషయాలను సుదీర్ఘంగా చర్చించుకునేందుకు 10-1-1953లో అత్యవసర సమావేశం కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో 1944 నుంచి 1952 నవంబరు నెల వరకు తయారుచేసిన కమిటీ లెఖలన్నిటినీ కూలంకుషంగా పరిశీలించారు. విద్యాలయానికి ఏటా వస్తున్న లోటును ఎలా భర్తీ చేయాలో కూడా గంటలతరబడి వివరంగా చర్చించారు. ఆనాటి సమావేశంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తిక్కవరపు రామిరెడ్డిగారు, ఆనం పద్మనాభరెడ్డిగార్లతో పాటు డా. బెజవాడ గోపాలరెడ్డిగారు, రేబాల దశరథరామిరెడ్డి గారు. ఎం.ఆదిశేషారెడ్డి గారు, మేనకూరు బలరామరెడ్డి గారు, వేమారెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు, పొణకా కనకమ్మ గారు, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు, ఎం. హేమలతమ్మగార్లు పాల్గొన్నారు.

పూజ్య బాపూజీ ఆశీస్సులతో ఎందరో వదాన్యుల వితరణతో మరెందరో మహనీయుల దీవెనలతో బాలికల విద్యకోసం ఏర్పడిన కస్తూరిదేవి విద్యాలయం పూర్వచరిత్రను కూలంకుషంగా పరిశీలిస్తే ఇలాంటి విషయాలన్నీ మనకు అర్థమవుతాయి.

> అప్పట్లో అందరి ఆలోచనలు విద్యాలయం అభ్యున్నతిపైనే ఉండేవి. ఇంకా ఏమిచేస్తే విద్యాలయం మరింత వృద్ధిలోకి వస్తుందనే విషయంపైనే అనేకసార్లు కమిటీలోని ప్రముఖులంతా కలిసి ఆలోచనలు సాగించేవారంటే వారికి ఈ విద్యాలయం పట్ల ఎంత అభిమానం ఉండేదో తేటతెల్లమవుతుంది.

## కమిటీ సమావేశాలంటే ఎంతో శ్రద్ధతో ఉండేవారు

కస్తూరిదేవి విద్యాలయానికి సంబంధించిన సమస్త వ్యవహారాలూ చూసుకునేది కమిటీయే కనుక, కమిటీ సమావేశాలు కూడా ఎంతో క్రమబద్ధంగా జరిగేవి. సభ్యులందరూ సమావేశాల పట్ల ఎంతో శ్రద్ధతో ఉండేవారు. ఏ విషయమైనా సరే అందరూ సమావేశం కావాల్సిందే తప్ప ఏకపక్షంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునేవారు కాదు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాతనే అందరూ కలిసి తగు నిర్ణయాలు తీసుకునేవారే తప్ప, ఎలాంటి మొగమాటాలకీ ఇందులో తావుండేది కాదు. అందులోనూ కమిటీలోని సభ్యులంతా ఎంతో గౌరవప్రదమైన కుటుంబాలవారు ఉండేవారు. అన్నిటికీ మించి అందరూ సమాజ సేవాపరాయణులు, జాతీయ భావాలు కలవారు కావడంతో కమిటీలో తీసుకునే అన్ని నిర్ణయాలు విద్యాలయం సర్వతో ముఖాభివృద్ధికి బాటలు వేసేవిగానే ఉండేవి.

సమావేశాల తేదీ నిర్ణయించాక ఆ రోజున ఎవరైనా సభ్యులు కారణాంతరాలవల్ల రాలేకపోతే, ఏ కారణం వల్ల రాలేకపోయారో వారు లేఖల ద్వారా తెలియజేసుకునేవారు. ఒకసారి ఈ సమావేశానికి రాలేకపోయిన రేబాల దశరథరామిరెడ్డిగారి వంటివారు కూడా ఎంతో వినమ్రంగా 'ఐ కెనాట్ అటెండ్ ఇన్‌వ్యూ ఆఫ్ బ్యాంక్ మీటింగ్' అని మినిట్స్‌లో రాశారంటే కమిటీ సమావేశాల పట్ల వారికున్న చిత్తశుద్ధికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేమి కావాలి?..

విద్యాలయం కమిటీ సమావేశాలు కూడా అప్పట్లో ఇంత చిత్తశుద్ధితో జరిగేవో తెలియజేసేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే. కమిటీ సమావేశాలంటే వారికంత శ్రద్ధాసక్తులు ఉండేవి. ఆ తర్వాత కొంతకాలానికి 15-12-1955లో జరిగిన కమిటీ సమావేశంలో డా. బెజవాడ గోపాలరెడ్డిగారు సభ్యులుగా తన పదవికి రాజీనామా చేయగా, ఆ స్థానంలో శ్రీ ఎన్వి రామానాయుడుగారిని కోఆప్ట్ చేసుకోవడం జరిగింది.

> సమావేశాల తేదీ నిర్ణయించాక ఆ రోజున ఎవరైనా సభ్యులు కారణాంతరాల వల్ల రాలేకపోతే, ఏ కారణం వల్ల రాలేకపోయారో వారు లేఖల ద్వారా తెలియజేసుకునేవారంటే సమావేశాల పట్ల వారికున్న గౌరవభావానికి, శ్రద్ధకు ఇంతకన్నా నిదర్శనం ఇంకేమి కావాలి?.....

## జాతీయ భావాలతో సమగ్రమైన చర్చలు.. సముచిత నిర్ణయాలు..

కమిటీ సమావేశాల్లో చర్చలు నిర్దిష్టంగా జరిగేవి. తీసుకునే నిర్ణయాలు కూడా ఖచ్చితంగా ఉండేవి. ఇందులో ఎలాంటి పక్షపాతానికి తావుండేది కాదు. ఈ సమావేశాల్లో విద్యాలయ నిర్వహణకు సంబంధించిన స్కూల్ లెక్కలు, హాస్టల్ లెక్కలపై జమాఖర్చులపై అందరి పరిశీలన ఉండేది. అందరూ ఈ విషయాలను గంటల తరబడి కూలంకుషంగా చర్చించి సముచితమైన నిర్ణయాలను తీసుకునేవారు.

ఎంతో ఉన్నతము, సంస్కారవంతమైన కుటుంబాలకు చెందిన ఆ మహనీయులందరూ అప్పట్లో జాతీయవాదంతో, దేశభక్తితో ఉండేవారు కనుక సమాజాభ్యున్నతి కోసం ఈ విద్యాలయం నిర్వహణ పట్ల ఎంతో శ్రద్ధ తీసుకునేవారు. అప్పట్లో ఒక పెట్రోల్‌బంకువారు కొంత స్థలాన్ని లీజుకు అడిగినా వారి ప్రతిపాదనపై.. "పెట్రోలు బంకుకు ఇప్పుడు ఉండే స్థలము గాక జాస్తి స్థలము ఇచ్చుటకు నేను అంగీకరించను.. ఇది నా అభిప్రాయము" అని శ్రీమతి పొణకా కనకమ్మగారు స్పష్టం చేశారంటే... వారి నిబద్ధతను అర్థం చేసుకోవచ్చు.

ఏ విషయమైనా సరే అందరు ప్రముఖులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకునేవారే తప్ప, ఎవరి చిత్తానుసారం వారు వ్యవహరించే వారు కాదు. ఎన్ని పని ఒత్తిడులు వున్నా కమిటీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై తమ అభిప్రాయాలను నిష్కర్షగా వెల్లడించే వారు. విద్యాలయం పురోగతే పరమ లక్ష్యంగా అందరూ ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరించేవారు. అందుకే... అప్పట్లో వారి నిర్ణయాలు ఎంతో స్వచ్ఛంగా, అవసరమైతే కఠినంగా కూడా ఉండేవి. సమగ్రమైన చర్చలతో సముచితమైన నిర్ణయాలతో కమిటీ సమావేశాలు జరిగేవి. కమిటీ సమావేశాలు జరిగినప్పుడల్లా విద్యాలయం అభ్యున్నతికి సంబంధించిన అంశాలపైనే వారు చర్చించి తగు నిర్ణయాలు తీసుకునేవారు. విద్యాలయం స్థాపన.. నిర్వహణ అంటే ఎంతో కష్టసాధ్యమైన ఆ రోజుల్లో.. అందులోనూ బాలికలకు చదువుచెప్పేందుకనే నాటి కాలంలో సంఘ సేవాభిలాషతో ఆ మహనీయులందరూ అకుంఠిత సేవాభావంతో కలిసి చేసిన కృషితో... నేడు ఈ విద్యాలయం సరస్వతీనిలయంగా వర్ధిల్లుతోంది.

> కమిటీలోని సభ్యులంతా ఎంతో గౌరవప్రదమైన కుటుంబాలవారుండేవారు. అన్నిటికీ మించి అందరూ సమాజ సేవాపరాయణులు, జాతీయభావాలు కలవారు కావడంతో కమిటీలో వీరంతా కలిసి తీసుకునే అన్ని నిర్ణయాలు విద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసేవిగానే ఉండేవి.

(మిగతా కథ వచ్చేవారం)

# వైసిపిలోకి వై.వి.రామిరెడ్డి



మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు, తెరచాటు రాజకీయాల్లో సిద్ధహస్తుడు వై.వి.రామిరెడ్డి తెలుగుదేశాన్ని వీడి, వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరనున్నాడు. జనవరి9వ తేదీన నెల్లూరు ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సమక్షంలో ఆయన వైసిపిలో చేరడానికి ముహూర్తం నిర్ణయించుకున్నాడు. 1983 నుండి వై.వికి రాజకీయాలతో పరిచయముంది. ఒకప్పుడు తాళ్ళపాక రమేష్‌రెడ్డికి అంతరంగికుడు. ఆ తర్వాత కొంతకాలం ఆనం వివేకాతోనూ సాన్నిహిత్యం ఉండేది. గత 14ఏళ్ళుగా ఆదాలకు నమ్మినబంటుగా ఉంటున్నాడు. అలాంటి వై.వి.రామిరెడ్డి ఈరోజు వైసిపిలో చేరుతుండడం చర్చనీయాంశంగా మారింది.

# కేసీఆరే కింగ్

(మొదటి పేజీ తరువాయి)



రెండవసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న కేసీఆర్

తెలంగాణలో కారు దూకుడుకు సైకిల్‌కు పంక్చరయ్యింది. కారు చక్రాల క్రింద నలిగి హస్తంకు ఫ్యాక్చరయ్యింది. అగ్గిపెట్టె వెలగలేదు... కొడవలికి పదును లేదు... చంద్రబాబు వ్యూహాలు ఫలించలేదు. సోనియమ్మ, రాహుల్‌ల ప్రచారం పని చేయలేదు. పొత్తుల్లో చిత్తుకాక తప్పలేదు. తెలంగాణలో 119 స్థానాలకు గాను టిఆర్ఎస్ 88 స్థానాలను గెలుచుకుని రాజకీయ పరిశీలకుల అంచనాలను సైతం తలక్రిందులు చేసింది. తెలంగాణలోని పది జిల్లాలకు గాను తొమ్మిది జిల్లాల్లో టిఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యం సాధించింది. ఈసారి అధికారంపై ఎన్నో ఆశలు పెట్టుకుని, ప్రమాణస్వీకారానికి సైతం ముహూర్తం పెట్టుకున్న కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోయింది. నాలుగు పార్టీలతో జత కట్టి ప్రజాఫ్రంట్‌గా ముందుకు సాగిన కాంగ్రెస్‌కు కేవలం 19సీట్లు దక్కగా, తెలంగాణలో కాంగ్రెస్‌తో జతకట్టి కేసీఆర్‌ను మట్టి కరిపించి హైదరాబాద్‌పై మళ్ళీ ఆధిపత్యం దక్కించుకోవాలనుకున్న చంద్రబాబు పన్నాగం బెడిసికొట్టి, 13సీట్లల్లో పోటీ చేసిన ఆ పార్టీకి కేవలం రెండంటే రెండు సీట్లే దక్కాయి. ఆ రెండు సీట్లు కూడా చంద్రబాబు సామాజికవర్గం బలంగా వున్న ఖమ్మం జిల్లాలోనివే కావడం విశేషం.

## జగజ్జేత కేసీఆర్...

ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ సాధించిన విజయం చూస్తుంటే 2009 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపించిన దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తాడు. ఆ ఎన్నికల్లో వై.యస్. ఏకపక్షంగా ముందుగానే అభ్యర్థులను ప్రకటించేశాడు. కేవలం వై.యస్. పాలనలో ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్‌ను విజయం వైపు నడిపించాయి. ఇప్పుడు కేసీఆర్ విజయం కూడా దాదాపు అటువంటిదే! గత నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో ఆయన చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలే ఆయన గెలుపుకు బాటలు వేశాయి. 24గంటలు కరెంట్, ప్రతి ఇంటికి నీళ్ళు, మిషన్ భగీరథ, కళ్యాణ లక్ష్మి, రైతులకు ఎరువులు, చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, పక్కా ఇళ్ళు... ఇలా ఎన్నో పథకాలు కేసీఆర్‌ను గ్రామాలకు చేరువ చేశాయి. మొత్తానికి గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో కేసీఆర్ పట్ల వున్న అభిమానం, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు పట్టణ ప్రాంతాలలో కేటిఆర్ పట్ల వున్న ఆకర్షణ, హరీష్‌రావు రాజకీయ వ్యూహాలు టిఆర్ఎస్‌కు అనూహ్య విజయాన్ని చేకూర్చాయి.

## తిరగబడ్డ ముందస్తు సెంటిమెంట్

కేసీఆర్ నిర్ణీత కాలానికి 8 నెలల ముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లాడు. మూడు నెలల ముందే 105 అసెంబ్లీలకు అభ్యర్థులను ప్రకటించాడు. ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ఏ పార్టీ గెలవలేదన్న సెంటిమెంట్‌ను తిరగరాసాడు. చాలా మొండి ధైర్యంతో ఆయన అసెంబ్లీని రద్దు చేశాడు. ఆ ఆత్మవిశ్వాసమే ఆయన్ను హీరోగా నిలిపింది.

## సెటిలర్ల నీరాజనం...

గ్రేటర్ హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో సీమాంధ్ర ప్రజలు ఎక్కువగా వున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 10అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సెటిలర్ల ప్రభావం వుంది. ఈ ఎన్నికల్లో సెటిలర్స్ అంతా కూడా టిఆర్ఎస్ వైపే మొగ్గు చూపారు. సెటిలర్స్ ఎక్కువగా వున్న నియోజకవర్గాలన్నీ కూడా టిఆర్ఎస్ ఖాతాలోనే జమవడ్డాయి. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలప్పుడే సెటిలర్లు టిఆర్ఎస్ వైపుకు వెళ్లారు. ఈ ఎన్నికల్లో కూడా వాళ్ళు అలాగే నిలబడ్డారు.

## కాంగ్రెస్ కుదేల్...

వాస్తవం చెప్పుకోవాలంటే కేసీఆర్ ఉద్యమం వల్ల తెలంగాణ రాలేదు. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ల సామాజికవర్గాన్ని దెబ్బతీయాలన్న సోనియాగాంధీ దుర్మార్గపు, దుష్ట ఆలోచన నుండే తెలంగాణ పుట్టింది. చెడపకురా చెడేవు... అన్న సామెత ఈ విషయంలో నిజమైంది. శుద్ధంగా వున్న, తమ పార్టీ బలంగా వున్న రాష్ట్రాన్ని సోనియాగాంధీ చీల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014 ఎన్నికలలోనే భూస్థాపితమైంది. తెలంగాణలోనూ రెండు వరుస పరాజయాలతో మట్టి కొట్టుకుపోయింది. 2019 ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ నిలబడి వుంటుంది. బీజేపీయే వచ్చిందంటే కాంగ్రెస్ ప్రతిపక్షంగా కూడా నిలవలేదు.

## ఓటమి బాట పట్టిన ధీరులు...

11వ తేదీ వెలువరించిన ఫలితాలలో ప్రజాఫ్రంట్‌కు మెజార్టీ సీట్లు వచ్చుంటేనా... సీఎం పదవి కోసం కనీసం పాతికమంది నాయకులు 'క్యూ'లో వుండేవాళ్ళు. కులాల వారీగా సీఎం కుర్చీ కోసం తన్నుకుంటుండేవాళ్ళు. తెలంగాణ ప్రజలు వాళ్ళకు ఆ శ్రమ లేకుండా చేశారు. ఒక్క పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డిని తప్పించి సీఎం అభ్యర్థులంతా పరాజయం వైపు క్యూ కట్టారు. జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, రేవంత్‌రెడ్డి, డి.కె.అరుణ, జీవన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గీతారెడ్డి, షబ్బీర్ అలీ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సర్వే సత్యనారాయణ లాంటి సీనియర్లు ఓడిపోయారు.

## కూటమే కొంప ముంచిందా?

కూటమి కట్టడమే కాంగ్రెస్ కొంప ముంచిందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. టిఆర్ఎస్‌ను ఎలాగైనా ఓడించాలి, అధికారంలోకి రావాలన్న తపనతో కాంగ్రెస్ నాయకులు చంద్రబాబును కలుపుకున్నారు. కూటమిలోకి అంతగా ప్రజాబలం లేని కోదండరాంను, సిపిఐని కలుపుకున్నారు. కలగూరగంపగా వచ్చిన వీళ్ళను తెలంగాణ ప్రజలు విశ్వసించలేదు. కేసీఆర్ ఏకనాయకత్వమే వారికి బాగుందనిపించింది. అదీగాక తెలంగాణను నేనే అభివృద్ధి చేసాను, హైదరాబాద్‌ను నేనే కట్టాను అంటూ డబ్బా కొట్టుకుంటున్న చంద్రబాబు ప్రసంగాలు కూడా తెలంగాణ ప్రజలలో వ్యతిరేకతను పెంచాయి. కాంగ్రెస్ పొత్తుల్లో తెలుగుదేశంకు 13సీట్లు, టిజెఎస్‌కు 8, సిపిఐకి 3 సీట్లు ఇచ్చింది. అంటే 24సీట్లు... ఈ సీట్లలో ఆ పార్టీల బలం చాలా తక్కువ. టిఆర్ఎస్ విజయం ఈ మూడు పార్టీలకు ఇచ్చిన సీట్ల నుండే మొదలైంది. 24సీట్లు వాళ్లకిస్తే వాళ్ళు గెలిచింది 2సీట్లే! అప్పనంగా టిఆర్ఎస్ ఖాతాలో 22సీట్లు వీళ్ళే చేర్చారు. కాంగ్రెస్ ఒంటరిగా అన్ని సీట్లకు పోటీ చేసుంటే, ఒకవేళ అధికారం రాకపోయి వుండొచ్చేమో గాని కనీసం ఇంకొన్ని సీట్లన్నా పెరిగి పరువు నిలబెట్టుకుని వుండేవాళ్ళు.

## ఫలించిన వ్యూహం...

ప్రజాసంక్షేమ పథకాలే కాదు, పార్టీ అధినేతల వ్యూహాలు కూడా పార్టీల గెలుపోటములను నిర్దేశిస్తుంటాయి. తెలంగాణలో కాంగ్రెస్‌కు 'రెడ్డి' సామాజికవర్గం ప్రధాన బలం. కేసీఆర్ వెలమ సామాజికవర్గం ప్రాబల్యం చాలాతక్కువ. కేసీఆర్ ఆ సామాజికవర్గంపైనే గురిపెట్టాడు. ఏకంగా 39మంది ఆ వర్గానికి చెందిన వారికి సీట్లిచ్చాడు. వారి బలాన్ని ఓట్ల రూపంలో రాబట్టుకున్నాడు.

తెలంగాణలో వార్ వన్‌సైడ్ అని ప్రచారం చేశారు... కేసీఆర్ దానిని నిజం చేశాడు. 2014 ఎన్నికల్లో టిఆర్ఎస్‌ను ప్రజలు పూర్తిగా నమ్మలేదు. హైదరాబాద్ సిటీలో అయితే ఆ పార్టీ ఖాతా తెరువలేదు. కాని ఈసారి హైదరాబాద్‌లోనూ హవా చూపింది. మొత్తానికి గతానికి భిన్నంగా పూర్తిస్థాయి విజయాన్ని అందుకుంది. తెలంగాణ రెండవ ముఖ్యమంత్రిగా కేసీఆర్ పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగిపోయింది.

మొత్తానికి తెలంగాణలో అవకాశవాద ప్రజాఫ్రంట్ కథ ఇంత ఛండాలంగా ముగిసింది.

# జాతీయ స్థాయి అథ్లెటిక్ మీట్‌కు ఎల్ఎపి స్కూల్ విద్యార్థిని



ఈ నెల 8, 9, 10వ తేదీలలో ప్రొద్దుటూరులో ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. ఈ పోటీలలో గూడూరు మండలం, చిల్లకూరులోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఎల్.లోహిత 100మీటర్ల పరుగు పందెంలో, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానాన్ని, 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకొని వచ్చేనెల హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, వైస్‌ఛైర్మన్ బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్, పి.ఇ.టి మరియు కోచ్ బి.రమేష్, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది లోహితకు శుభాభినందనలు తెలిపారు.



ఈ నెల 12వ తేదీ గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం ఛారిటీస్ వృద్ధుల ఆశ్రమంలో పిఎస్ఆర్ ట్రస్ట్ సౌజన్యంతో లక్షరూపాయలతో నిర్మించిన రేకుల షెల్టర్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ట్రస్ట్ అధినేత పాణకా శివకుమార్ రెడ్డి, ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ, మనపాటిరవీంద్ర, ట్రస్ట్ సభ్యులు

# బ్యాండ్ పడింది

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్‌లో మాట్లాడుతుండేవాడు. పచ్చ ఛానెల్స్‌లో క్షణక్షణానికి స్క్రోలింగ్స్ మారుతుండేవి. 'తెలంగాణ రాజకీయాలలో చక్రం తిప్పుతున్న చంద్రబాబు'... 'సీఎం అభ్యర్థులంతా చంద్రబాబు కరుణ కోసం పడిగాపులు'... 'చంద్రబాబు చుట్టూ తెలంగాణ రాజకీయం'... అంచనాలు తారుమారయ్యాయి. దీంతో వీళ్ళకు ఈ పని లేకుండా పోయింది. తెలంగాణలో టిఆర్ఎస్ గెలుపుకు కేసీఆర్ కారణం కావచ్చు. కాంగ్రెస్ ఓటమికి కారణం చంద్రబాబు. తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవడం ద్వారా కాంగ్రెస్‌పార్టీ తన నెత్తిన తానే మట్టేసుకుంది. చంద్రబాబుతో పొత్తే వాళ్ళ కొంప ముంచింది.

తెలంగాణ, ఆంధ్ర రెండు రాష్ట్రాలుగా వేరుపడ్డాయి. 2014 ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు కూడా తెలంగాణలో పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలిచింది. వైసిపి, టిడిపిలు ఇక ఆంధ్రా పార్టీలుగా ముద్రపడ్డాయి. టిడిపి, వైసిపిల నుండి గెలిచిన వాళ్ళు కూడా చాలావరకు టిఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారు. కొందరు కాంగ్రెస్, బీజేపీలవైపు వెళ్లారు. అంటే ఈ రెండు ఆంధ్రా పార్టీలు అక్కడ నిర్వీర్యమయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ చేసిన తెలుగుదేశం ఒకే ఒక సీటును గెలుచుకుంది. సెటిలర్లు అంతా కూడా టిఆర్ఎస్ వైపు వెళ్లిపోయారని చంద్రబాబు అప్పుడే అర్థం చేసుకుని వుండాలి. కాని, ఆయన అలా అర్థం చేసుకోలేదు. తెలంగాణలో ఇంకా తనకు బలముందని, హైదరాబాద్‌పై మళ్ళీ పెత్తనం సాగించాలని, అందుకు ఒక్కడి శక్తి చాలదని కాంగ్రెస్‌తో జత కట్టాడు. కాంగ్రెస్‌కు ఇక్కడే దరిద్రం మొదలైంది. కూటమి ప్రచారం అంతా చంద్రబాబు చేతుల్లోకి వెళ్లిపోయింది. కూటమి ప్రచార సభలలో చంద్రబాబు తన భజనే ఎక్కువగా చేసుకోసాగాడు. తెలంగాణ ప్రజల సమస్యల కంటే కూడా హైదరాబాద్ నా పుణ్యమే అన్నట్లు చంద్రబాబు మాట్లాడసాగాడు. తెలంగాణ ప్రజలు ఆయన మాటలను స్వాగతించలేదు. సరికదా, ఆయనపై ఇంకొంత వ్యతిరేకత పెరిగింది. అన్నింటికి మించి కాంగ్రెస్‌లో చంద్రబాబు పెత్తనాన్ని ఆ పార్టీకి బలమైన మద్దతుదారులుగా వున్న రెడ్లు సహించలేకపోయారు. హైదరాబాద్ సిటీతో పాటు ఆయా జిల్లాల్లో రెడ్ల ప్రాబల్యం బలంగా వుంటుంది. చంద్రబాబు కాలుపెట్టాక ఆయనపై వ్యతిరేకతతో వీళ్లంతా టిఆర్ఎస్ వైపు మళ్లారు. దీనికితోడు కాంగ్రెస్, టిడిపిల కూటమి ఓడిపోవాలనే కసితో వైసిపి అభిమానులు, పవన్ అభిమానులు కూడా టిఆర్ఎస్‌కే మద్దతు పలికారు. ఇక సెటిలర్స్ అయితే చంద్రబాబును అసలు పట్టించుకోలేదు. ఈ పర్యవసానాల నేపథ్యంలోనే టిఆర్ఎస్‌కు ఘనవిజయం. కూటమికి దారుణ పరాజయం. కొంతకాలం క్రితం చంద్రబాబు ఆవేశంగా చెప్పాడు... కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తానని... ఈ రూపంలో ఆయన కాంగ్రెస్‌ను నాశనం చేస్తాడని ఎవరూ ఊహించలేదు. టిఆర్ఎస్ వాళ్లకు నిజమైన కృతజ్ఞత అన్నది వుంటే... చంద్రబాబుకు వాళ్ళు జీవితాంతం ఋణపడి వుండాలి.

# శ్రద్ధాంజలి



1920 2018

మా ఇంటి దీపం.. ప్రేమానురాగాల ప్రతిరూపం

## శ్రీ ఆదాల శంకరరెడ్డి గారు

తేది.07.12.2018 శుక్రవారం నాడు పరమపదించారు.

వారి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య
**ఆదాల సుశీలమ్మ**

కుమారులు
**ఆదాల ప్రభాకర్‌రెడ్డి**
మాజీమంత్రి
**ఆదాల మురళీకృష్ణారెడ్డి**

కుమార్తెలు
**గునుపాటి శ్యామల**
**బిరుదవోలు జలజ**

మనుమడు
**ఆదాల వంశీకృష్ణారెడ్డి**

**ఉత్తరక్రియలు :**

వారి **పెద్దకర్మ** తేది 19.12.2018, బుధవారం, ఉదయం 11.00 గంటలకు హైదరాబాదు, మాదాపూర్, హైటెక్ సిటి సమీపంలోని **ఆవాస హోటల్** నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com